జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభ్యులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును.
వివరాలకు సంప్రదించండి
9000621111, 9440137451
76600 27670, 9908991763

సంపుటి 15 సంచిక 306 విశాఖపట్నం గురువారం 21 జులై 2022 8 పేజీలు వెల : 5.00

# స్థానికులకే ఉద్యోగాలు

## రామాయపట్నం పోర్టు పనులకు శంకుస్థాపన.. స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న సీఎం జగన్



నెల్లూరు, ప్రజాపాలన ప్రతినిధి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టు అభివృద్ధి పనులను ఏపీ ప్రభుత్వం బుధవారం లాంఛనంగా ప్రారంభించింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 11,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును మూడు దశల్లో పూర్తి చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరులతో ఓడరేవును నిర్మించి మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్లాన్ చేస్తోంది. 36 నెలల్లో రూ. 3,736 కోట్లతో మొదటి దశను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశ కింద నాలుగు బెర్త్ లను అభివృద్ధి చేస్తారు. పోర్టు పూర్తయితే ఇక్కడి నుంచి ఏడాదికి 25 మిలియన్ టన్నులు ఎగుమతి, దిగుమతులు చేయొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. నెల్లూరు జిల్లా యంత్రాంగం 803 ఎకరాల భూమిని సేకరించి ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు (ఏపీఎంబీ)కి అప్పగించింది. కాగా, నిర్వాసితు లను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుందని అన్నారు. పోర్టు వల్ల వేలాది మందికి ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. భూమి ఇచ్చేందుకు ముందుకు వచ్చిన గ్రామస్తులకు, రుణాలు అందించిన బ్యాంకులకు సీఎం జగన్? కృతజ్ఞతలు తెలిపారు. పోర్టులో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇక.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆరు ఓడరేవులకు అదనంగా నాలుగు కొత్త పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. తొమ్మిది షిప్పింగ్ హార్బర్‌లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. 2019 జనవరి 9న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పోర్టుకు శంకుస్థాపన చేశారు. చంద్రబాబు ఐదేళ్లుగా చేసిందేమీ లేదని, ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్నికల ముందు హడావిడిగా పోర్టుకు శంకుస్థాపన చేశారని జగన్ మోహన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.



### రాజ్యసభ సభ్యురాలిగా పీటీ ఉష ప్రమాణస్వీకారం..

ఢిల్లీ: ప్రజాపాలన ప్రతినిధి: లెజెండరీ ప్లేయర్ పీటీ ఉష రాజ్యసభ సభ్యురాలిగా బుధవారం నాడిక్కడ ప్రమాణస్వీకారం చేశారు. ఆమెతో రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రమాణం చేయించారు. పీటీ ఉష 1984 ఒలింపిక్స్‌లో 4వ స్థానంలో నిలిచింది. పీటీ ఉష 1983లో అర్జున అవార్డు, 1985లో పద్మశ్రీ అందుకున్నారు.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నూతన అధ్యయనం జరగాలి..

### పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై లోతైన అధ్యయనం జరగాలని శ్రీలంక బాటలోనే రాష్ట్రం పయనిస్తున్నట్లుగా స్పష్టమవుతున్నదని పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పది రాష్ట్రాలలో ఆర్థిక పరిస్థితిపై కేంద్రం చేసిన ప్రకటన రాష్ట్రంలో తమ వాదనను బలపరుస్తున్నదని తెలిపారు. శ్రీలంక ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై అంచనాలు వేయాలని కేంద్ర ఆర్థిక శాఖ ఆర్బీఐను ఆదేశించిందని తెలిపారు. సమగ్ర అధ్యయనం తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ నివేదికలు ఇచ్చిందని ఆర్థిక సంక్షోభం దిశగా ఆంధ్రప్రదేశ్ సాగుతున్నట్లుగా స్పష్టమైందన్నారు. దాదాపు 10 నివేదికలు వస్తే వాట న్నిటిలో ఒకటి ,రెండు స్థానాలలోనే రాష్ట్రం ఉందని పయ్యావుల కేశవ్ వెల్లడించారు. రూ. 50 వేల కోట్ల అప్పులకు సంబంధించిన పద్దులు ఇంతవరకు కేంద్రానికి అందలేదని తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్రానికి ఇవ్వని క్వాలిఫైడ్ సర్టిఫికెట్ ఏపికి కాగ్ ఇచ్చిందని వెల్లడించారు. శ్రీలంక కన్నా నాలుగురెట్ల అప్పు రాష్ట్రం ఎక్కువగా చేసిందని తెలిపారు. సంక్షేమం ముసుగులో ఆర్థిక అరాచకానికి పాల్పడుతుందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో వివిధ శాఖల ద్వారా మరిన్ని అప్పులు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై చర్చించేందుకు తాము సిద్దంగా ఉన్నామని ఆర్థిక మంత్రి బుగ్గన ఎక్కడికి పిలిచిన వస్తామని పయ్యావుల కేశవ్ సవాల్ విసిరారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గిపోతుంటే అప్పులు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంక్షోభం వివరాలను ప్రజల ముందుంచుతామని పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

## ధవళేశ్వరం, పోలవరం వద్ద తగ్గిన వరద.. శ్రీశైలం వద్ద ఉధృతి

తూర్పుగోదావరి,ప్రజాపాలన ప్రతినిధి:ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద నీరు తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం(బుధవారం ఉదయం నాటికి) 16.50 అడుగులకు చేరుకుంది వరద నీటిమట్టం. సుమారు 17 లక్షల 15 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి వరద ఉధృతి బాగా తగ్గింది. ప్రాజెక్ట్ స్పీల్వే వద్ద 34.6 మీటర్లకు చేరుకుంది వరద నీరు. 48 గేట్ల ద్వారా దిగువకు 15.58 లక్షల క్యూసెక్కుల వరద నీరు వదులుతున్నారు.

శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఇన్ ఫ్లో : 2,52,967 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో : 19,070 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885.00 అడుగులు కాగా ప్రస్తుతం 876.00 అడుగుల వద్ద ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం : 168.2670 టీఎంసీలుగా ఉంది. ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.



## ఏపీ హైకోర్టుకు ఏడుగురు కొత్త న్యాయమూర్తులు




ఢిల్లీ,ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ హైకోర్టుకు ఏడుగురు కొత్త న్యాయమూర్తులను నియమించారు. సీజేఐ ఎన్వీ రమణ నేతృత్వంలోని న్యాయమూర్తుల నియామకంపై కొలీజియం సిఫార్సు చేసింది. ఏడుగురు న్యాయాధికారులకు జడ్జీలుగా పదోన్నతి కల్పించారు. వెంకట రవీంద్రబాబు, రాధాకృష్ణ కృప సాగర్, శ్యామ్‌సుందర్, శ్రీనివాస్ ఊటుకురు, బోపన్న వరహ లక్ష్మీ నరసింహ చక్రవర్తి, మల్లికార్జునరావు, వెంకటరమణ పేర్లను జడ్జీలుగా కొలీజియం సిఫార్సు చేసింది. కొలీజియం సిఫార్సును త్వరలో రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. ఏపీ హైకోర్టులో ఫిబ్రవరి నెలలో ఏడుగురు న్యాయమూర్తులను నియమించిన విషయం తెలిసిందే. న్యాయమూర్తులుగా కె. శ్రీనివాసరెడ్డి, జి రామకృష్ణప్రసాద్, ఎన్ వెంకటేశ్వర్లు, టి రాజశేఖర్‌రావు, ఎస్ సుబ్బారెడ్డి, సి. రవి, వి. సుజాతలను నియమించారు. జనవరి 29న కొలిజీయం భేటీలో సీజేఐ ఎన్వీ రమణ నేతృత్వంలో జరిగిన సమావేశంలో సిఫారసు చేశారు.

## చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా : సిపిఐ నారాయణ



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: తిరుపతిలో జరిగిన మీడియా సమావేశంలో మెగాస్టార్ చిరంజీవిపై తాను చేసిన వ్యాఖ్యలు బాషా దోషంగా భావించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా.. మెగా అభిమానులు, కాపునాడు మహానుభావులు ఈ వ్యాఖ్యలు ఇంతటితో మరిచిపోండి అని కోరారు.. రాజకీయాల్లో ఆరోపణలు, విమర్శలు చేస్తుటాం.. చిరంజీవి గతంలో రాజకీయాల్లో ఉన్నారు.. రాజకీయాల్లో విమర్శలను స్పోర్టివ్‌గా తీసుకోవాలి.. కానీ, ఆయనపై తాను అలాంటి వ్యాఖ్యలు చేసి ఉండకూడదన్నారు. ఇక, వరద బాధితులను ఆదుకోవడం కోసం అందరూ కలిసి పని చేద్దాం.. వరద సహాయక చర్యల్లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విఫలం అయ్యారని దుయ్యబట్టారు. వైఫల్యం కప్పిపుచ్చుకోవడానికే పోలవరం వరద వివాదానికి కారణంగా పేర్కొన్నారు. (మిగతా 2లో..)

## ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం: జీవీఎల్



ఢిల్లీ:ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని ఎంపీ జీవీఎల్ నరసింహరావుమరోసారి ప్రకటించారు. బుధవారం ఆయన మీడియాతో కేంద్రంపై తప్పుడు ప్రచారాల కోసం ప్రయత్నం చేయొద్దని సూచించారు. ప్రత్యేక హోదాపై గతంనే స్పష్టత ఇచ్చామని తెలిపారు. ప్రత్యేక హోదా పై మాట మార్చింది టీడీపీ , వైసీపేనని విమర్శించారు. రాష్ట్రాల అప్పులకు కేంద్రమే బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. ఏపీ ప్రభుత్వాలు చేసిన తప్పుల వల్ల పోలవరం ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు. ఓబీసీలను కేంద్ర జాబితాలోకి చేర్చే ప్రతిపాదన రాష్ట్రం నుంచి రాలేదని జీవీఎల్ నరసింహారావు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో నవ్యాంధ్రకు ఐదు కాదు, పదేళ్ల ప్రత్యేక హోదా ఇవ్వాలని బీజేపీ పట్టుబట్టింది. కానీ... అధికారంలోకి రాగానే ఆ మాట పక్కనపెట్టింది. ఆర్థిక సంఘం సిఫారసుల పేరు చెప్పి హోదాకు సమానమైన ప్రయోజనాలతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. రాష్ట్ర విభజన కష్టాలు, విభజన హామీలు నెరవేర్చుకోవాల్సిన అవసరం, కేంద్ర సహకార ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని అప్పటి టీడీపీ సర్కారు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సామరస్య ధోరణి ప్రదర్శించింది.

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

# సాహితీ సృజనకు 'అనంత' పుట్టినిల్లు

## దాసన్నగారి కృష్ణమూర్తి సన్మానసభలో ఆచార్య బాలసుబ్రమణ్యం




అనంతపురం, ప్రజాపాలన ప్రతినిధి: సాహితీ సృజనకు అనంతపురము జిల్లా పుట్టినిల్లు అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ఇటీవల పద్మశ్రీ జ్ఞానానందకవి పురస్కారం పొందిన అనంత జిరసం గౌరవ సలహాదారులు దాసన్నగారి కృష్ణమూర్తికి అనంతపురము జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని స్థానిక హిందీ సేవాసదన్ నందు ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ అభినందన సభకు ఆచార్య బాలసుబ్రమణ్యం అధ్యక్షత వహించగా, డా. పతికి రమేష్ నారాయణ, ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎన్.రంగస్వామి, సిఎస్ఆర్డి సంస్థ అధ్యక్షులు బోస్‌లు ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, అనంత సాహిత్యంలో దాసన్నగారి కృష్ణమూర్తిది విలక్షణమైనశ్కైలి అని అభివర్ణించారు. తాను నమ్మిన సిద్ధాంతాలను సాహితీమార్గంలో నిశ్శబ్దంగా అమలుచేస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. డా?బి.ఆర్.అంబేద్కర్, గుఱ్ఱం జాషువా, డా.బోయి భీమన్నల బావజాలాన్ని ఒడిసి పట్టుకొన్న సాహితీవేత్త కృష్ణమూర్తికి పద్మశ్రీ జ్ఞానానందకవి పురస్కారం దక్కడం అభినందనీయం అన్నారు. అనంతరం పురస్కార గ్రహీత దాసన్నగారి కృష్ణమూర్తిని నిర్వాహకులు అనంతపురము జిల్లా రచయితల సంఘం (అనంత జిరసం) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాకే శ్రీహరి మూర్తి, తోట నాగరాజు శాలువాలు, పూలమాలలతో, ముమేంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా, ఎంతో ఆత్మీయంగా తనను సన్మానించిన నిర్వాహకులు అ.జి.రసం. వారికి, అభినందనలు తెలిపిన వారికి, ఎస్టీ జ్ఞానానందకవి గారి శత జయంతి పురస్కారం ఇచ్చిన జ్యోత్స్న కళాపీఠం వారికి, నాకు జన్మ నిచ్చింది నాతల్లి, అయితే నాకు పునర్జన్మ నిచ్చింది నాసహచరి 'జ్యోతి'అనీ, వీరికి, ఈ స్థాయినిచ్చిన అనంత సాహితీ సమాజానికి సన్మాన గ్రహీత కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు . మున్ముందు మరింత సామజిక బాధ్యతతో మరిన్ని మంచి రచనలను మీ ముందుకు తెస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అనంత జిరసం ఉపాధ్యక్షులు డా. అంకే రామలింగమయ్య, షేక్ రియాజుద్దీన్, సహాయ కార్యదర్శి కట్టుబడి తానీషా, తెలుగు వెలుగు టివీ రెడ్డి, లఘు చిత్ర నటుడు, నిర్మాత "ఓమ్ క్రియేషన్స్ " పుట్లూరు శ్రీరాములు, బత్తల అశోక్ కుమార్ , బుద్ధవిహార్ పార్క్ ప్రతినిధులు మిద్దె రమీంద్ర, స్నేహాక్లబ్ ప్రతినిధులు ఎం.న్.రామాంజనేయులు, ఏ. నీలకంఠ, గంధం ప్రకాష్‌బాబు, ఆపిల్ ఎన్జిఓ అధ్యక్షులు సాకే తిరుపాలు, కమలనాథ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదలు శాశ్వత పరిష్కారం ఎప్పుడు..?



రాజమండ్రి, జూలై 20,: గోదావరి నదిలో ఉవ్వెత్తున వరదనీరు పోటెత్తి ప్రహిస్తోంది. దీంతో ఇరు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు వరద ముంపుతో అల్లాడిపోతున్నారు. వరద విలయంతో వందలాది లంక గ్రామాల వానులు గజగజలాడుతున్నారు. తినడానికి తిండి లేక, తాగేందుకు నీరు లేక, తలదాచుకోవడానికి చోటు లేక తల్లడిల్లిపోతున్నారు. లక్షల కోట్ల రూపాయల వంటలు నీటమునిగాయి. వేలాది పశువులు, పెంపుడు పక్షులు, సామాగ్రి వరద ఉధృతిలో కొట్టుకుపోయాయి. తెలంగాణలోని పవిత్ర పుణ్య క్షేత్రం భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వెళ్లేందుకు నిర్మించిన శబరినదిపై వంతెన పైనుంచి కూడా వరదనీరు ప్రవహిస్తోంది. భద్రాచలం క్షేత్రంలో వరదనీరు ముంచెత్తేసింది. భద్రచాలం వద్ద గోదావరి నీటిమట్టం అత్యంత ప్రమాదకర స్థాయిలో 71 అడుగులకు చేరుకుంది. నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు వద్ద కూడా వరద గోదావరి ఉవ్వెత్తున ప్రవహిస్తోంది. దిగువన తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద పోటెత్తి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి వరదనీరు సుమారు 21 అడుగులకు చేరింది. దీంతో అధికారులు 175 బ్యారేజీ గేట్లు ఎత్తివేసి సముద్రంలోకి 23 లక్షల 94 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వందేళ్ల చరిత్రలో 41 పర్యాయాలు గోదావరి నదిలో భారీ వరదలు ముంచెత్తాయి. వరద పోటెత్తినప్పుడల్లా వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అన్నింటినీ పోగొట్టుకుని అతలాకుతలం అయిపోతూనే ఉన్నారు. 1853 నుంచీ చూసుకుంటే.. ధవళేశ్వరం వద్ద రికార్డు స్థాయిలో అత్యధికంగా 1986 ఆగస్టు 16న 35.1 లక్షల క్యూసెక్కుల వరదనీరు ప్రవహించినట్లు రికార్డయింది. అంతకు ముందు 1953 ఆగస్టు 19న రెండో అత్యధిక వరదగా నమోదై 30 లక్షల క్యూసెక్కులు ప్రవహించింది. 2006 ఆగస్టు 7వ తేదీన ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 28.5 లక్షల క్యూసెక్కుల వరద రికార్డయింది. 1990 ఆగస్టు 25న 27.8 లక్షల క్యూసెక్కుల వరదనీరు, 2010 ఆగస్టు 9న 20.1 లక్షల క్యూసెక్కుల వరదనీరు నమోదైంది. ఇక తాజాగా గోదావరికి వచ్చిన వరద 21 నుంచి 22 లక్షల క్యూసెక్కులకు చేరుతుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేశారు. అంటే.. గోదావరి నది చరిత్రలో 41 సార్లు వచ్చిన వరదల్లో ఈసారా నాలుగో లేదా ఐదో అతిపెద్ద వరదగా రికార్డు అవుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే.. పదుల సార్లు గోదావరి వరదలు పోటెత్తి గ్రామాలకు గ్రామాలనే ముంచేసి, లక్షల కోట్ల ఆస్తులకు నష్టం కలిగిస్తున్నా.. వేలు, లక్షల మూగజీవాలు మృత్యువాత పడుతున్నా ముందస్తు చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాలు ఏమి చేశాయనే ప్రశ్న తలెత్తుతోంది. ఇంటికి చుట్టం వచ్చిన తర్వాత పొయ్యి వెలిగించినట్టు ఏవో తాత్కాలిక చర్యలే తప్ప వరదలతో జననష్టం, ఆస్తి నష్టం జరగనివిధంగా ప్రభుత్వాలు శాశ్వతంగా చేసిన ప్రయత్నాలేవీ లేవనేది బాధితులందరి నోటా వినిపిస్తున్న విమర్శ. వరదలు ముంచెత్తుకు వచ్చిన తర్వాత నది కరకట్టలపై కొన్ని ఇసుకబస్తాలు వేయడమే తప్ప ఏటి గట్లను పటిష్టంగా ఏర్పాటు చేసే దిశగా ఏ ఒక్క ప్రభుత్వమూ చర్యలు చేపట్టలేదనేది వాస్తవం అంటున్నారు. వరదనీరు ఊళ్లను ముంచెత్తిన తర్వాత బాధిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వారికి అరకొరగా భోజన, వసతి సౌకర్యాలు కల్పించి, ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. వరదపోటు ఎక్కువైనప్పుడు ఆర్మీని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపుతున్నాయి తప్ప బాధితుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపెట్టకుండా ఉపేక్షిస్తున్నాయంటున్నారు. ఇప్పటికైనా వరద కష్టాల నుంచి తమను శాశ్వతంగా బయటపడేసేందుకు సరైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను బాధితులు వేడుకుంటున్నారు.

# కార్పొరేషన్ చేశారు... మౌలిక సదుపాయాల్ని మరిచారు..

## పట్టిపిడిస్తున్న ఇరుకు రోడ్లు, ట్రాఫిక్ సమస్యలు..డ్రైనేజి సమస్యలు ఇది శ్రీకాకుళం పట్టణం దుస్థితి ...



శ్రీకాకుళం జిల్లా: శ్రీకాకుళం పట్టణానికి పట్టిపిడిస్తున్నా అతి పెద్ద సమస్య ట్రాఫిక్, ఇరుకు రోడ్లు. నానాటికి వాహనాల సంఖ్య పెరిగిపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతుంది. సరైన ప్రణాళిక లేకపోవడం, దూరదృష్టితో మౌలిక సదుపాయల్ని అభివృద్ధి వర్చక పోవడంతో శ్రీకాకుళం ప్రగతి చాలా దీనస్థితిలో ఉంది. నగర పంచాయితీకి ఎక్కువ, మన్సిపాలటీ తక్కువగా మౌలిక సదుపాయాలు ఉన్నాయని ప్రజలు మధనపడుతున్నారు. అయినా కార్పొరేషన్ స్థాయిలో పన్నులు వసూలు చేస్తున్నారని ఆవేధన చెందుతున్నారు. చినుకు పడితే చాలు రోడ్లలన్నీ మునిగిపోతున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్సు అయితే నీటిలో మునిగిపోయి, పడవలు వేసుకొనే పరిస్థితి వస్తుంది. రోడ్లు విషయంలోనైతే చెప్పనక్కర్లేదు. అవే సందులు, అవే పరిస్థితులు.. మార్పు రావడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది పట్టణ దుస్థితి. చిన్న బజారు రోడ్డులో ప్రకాష్ బాబు బూక్ స్టాల్ నుంచి కళ్యాణి మెస్ వరకూ, అదే రోడ్డులో రైతు బజారు వద్ద కూడా విపరీతమైన రద్దీ ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్ జాములు నిత్యకృత్యం అయ్యాయి. దీనితో వాహనాల రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే రామలక్ష్మణ్ , సూర్యమహల్, కిన్నెర థియేటర్ జంక్షన్ వద్ద కూడా సినిమాలు విడిచి పెట్టేసమయాల్లో రద్దీ విపరీతంగా ఉండి, సమస్య మరింత జఠిలమవుతుంది. పెరుగుతున్నా ట్రాఫిక్ అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో సమస్య పరిష్కారంలో పోలీసులు కూడా ఏమీ చేయలేక పోతున్నారు. సమర్ధవంతంగా ట్రాఫిక్ ను నియంత్రించ లేకపోతున్నారు. కార్పొరేషన్ అయిందని అధికారులు చెబుతున్నా, శ్రీకాకుళం పట్టణంలో రోడ్డ్ల, మౌలిక సదుపాయాలు ఆ స్థాయిలో లేవు. మెరుగుపడతాయినే ఆశలు కూడా లేవు. పన్నులు వసూలు చేయడం వరకే కార్పొరేషన్ ఉంది తప్పా, పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి కాదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా ఇరుకు, ఇరుకు సందులే. ఎక్కడ చూసిన రోడ్లపైన అక్రమణలే. అసలే ఇరుకు రోడ్లు, ఆపై అక్రమణలైతే, వాహనచోదకు లు పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కనీసం మలుపులు వద్ద కూడా రోడ్ల వెడల్పు చేయకపోవడంతో స్థానికలకు పాట్లు తప్పడం లేదని జిల్లా ప్రజా సమస్యల వేదిక అధ్యక్షులు బి వి రవిశంకర్ వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవటంతో ఎప్పటికీ మరుగునీటి కలువల సమస్య తీరడం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి. వ్యాధులు వ్యాపిస్తున్నాయి. అయినా అధికారులు, శాశ్వత సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కాంప్లెక్సు సమీపంలో ట్రావెల్ బస్సుల్ని పాత్రునివలస జాతీయ రహదారిపైకి మార్పు చేయాలని, ఎన్నో ఎళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకొన్న నాధుడే లేరని ప్రజలు రుసరుస లాడుతున్నారు. ఈ బస్సులు కారణంగా సాయంత్రం అయిదు గంటల నుంచి సమస్య ప్రారంభమవుతుంది. కాంప్లెక్సు సమీపంలో ఉండటంతో విపరీతమైన రద్దీతో జనాలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడో మరో గమ్మత్తు ఏమిటంటే.. రోడ్డ ప్రక్కనే ఆటోలు నిలిపితే ఫోటోలు తీసే పోలీసులు, గంటలు తరబడి రోడ్డు ప్రక్కనే ట్రావెల్ బస్సులు ఆపితే ఎందుకు ఫోటోలు తీసి, అపరాధ రూసుం వేయడం లేదో అర్థం కావడం లేదు. ఇరుకు రోడ్డులో హెల్మెట్ ముఖ్యం కాదని పోలీసులకు అర్థం కావడం లేదు. ఫోన్ లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, త్రిపుల్ డ్రైవింగ్ వలన ఇక్కడ ఇరుకు రోడ్లలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నా, పోలీసులు కేవలం హెల్మెట్ కేసులపైనే దృష్టి పెడుతున్నారు. మలుపులు వద్ద ప్రయాణించడానికి స్కూల్ పిల్లలే కాదు.. పెద్ద వారు సైతం కూడా బెంబేలెత్తిపోతున్నారు. ఆ మలుపుల సందుల్లో ప్రయాణించడ మంటే కోరి ప్రమాదాలు కొనితెచ్చుకోవడమే అవుతుందని వాపోతున్నారు. న్యూ కాలనీ నుంచి ప్రకాష్ నగర్ వచ్చే మలుపు అయితే అతి ప్రమాదకరంగా మారింది. పది అడుగులు కూడా లేని ఈ ఇరుకు సందులో రొడ్డుపై జియో పొల్స్ వేయుడంతో రోడ్డ మలుపు మరింత ప్రమాదకర మైంది.

# చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా : సిపిఐ నారాయణ

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ వ్యాఖ్యలపై మెగా బ్రదర్ నాగబాబు ఘాటుగా స్పందించారు. "నారాయణ అనే వ్యక్తి చాలా కాలం నుండి అన్నం తినడం మానేసి కేవలం ఎండు గడ్డి , చెత్తా ,చెదారం తింటున్నాడు.. మన మెగా అభిమానులందరికీ నా హఅదయపూర్వక విన్నపం ఏమిటనగా.. దయచేసి వెళ్లి అతనితో గడ్డి తినడం మాన్పించి కాస్త అన్నం పెట్టండి. తద్వారా అతను మళ్లీ తెలివి తెచ్చుకుని మనిషిలా ప్రవర్తిస్తాడు" అంటూ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.. దీంతో, వివాదం మరింత పెరిగే అవకాశం ఉందని భావించిన నారాయణ.. మెగాస్టార్ చిరంజీవిపై తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా.. నా వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటానని ప్రకటించారు.

కాగా, తాజాగా భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు చిరంజీవి హాజరుకావడాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తప్పుపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "చిరంజీవి ఊసరవెల్లి లాంటి వాడని, చిల్లర బేరగాడు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.. అల్లూరి సీతారామరాజుగా నటించి ప్రేక్షకులకు అల్లూరిని పరిచయం చేసిన సూపర్ స్టార్ కఅష్ణను పిలవకుండా చిల్లర బేరగాడు చిరంజీవిని స్టేజి మీదకు తీసుకువచ్చి పక్కన కూర్చోబెట్టుకున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో పవన్ కల్యాణ్ ఓ ల్యాండ్ మైన్ లాంటివాడని అది ఎప్పుడు పేలుతుందో ఎవరికీ తెలియదని చెప్పుకొచ్చారు. అయితే, మెగా బ్రదర్స్‌పై నారాయణ చేసిన వ్యాఖ్యలపై మెగా ఫ్యాన్స్‌తో పాటు జనసేన శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం.. నాగబాబు కూడా రంగంలోకి దిగడంతో.. ఇక చేసేది ఏమీ లేక.. నారాయణ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నారు.

# కఠిన నిర్ణయాలపై చర్చోపచర్చలు

విజయవాడ, జూలై 20, :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లే కనిపిస్తుంది. కనికరం లేకుండా సీరియస్ గానే ఉందామని నిర్ణయించుకున్నట్లుంది. "ఎలాంటి బంధు ప్రీతి లేదు. రాజీ లేదు. ఎవరు కష్టపడితే వారికే టిక్కెట్లు. ఎవరు అలిగినా సరే. ఎవరు ఏమనుకున్నా సరే. ఎవరు బాధపడినా నాకేం పరవాలేదు. గెలిచే వారికే టిక్కెట్లు. ఆరునెలల్లో కఠిన నిర్ణయాలుంటాయి." అంటూ జగన్ నిర్ద్వందంగా జగన్ వ్యాఖ్యానించారు.. దాదాపు 70 మంది ఎమ్మెల్యేలను మారుస్తారని ఎప్పటి నుంచో వినపడుతుంది. గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం వర్క్ షాప్ లో జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ అధికారంలోకి రావడమే ముఖ్యమని వ్యక్తుతు కాదని జగన్ నిర్మొహమాటంగా చెప్పారు. సీరియస్ వార్నింగ్... అంతర్గత సర్వేల్లో స్థానిక ఎమ్మెల్యేలపై వ్యతిరేకత కారణంగా అధికారాన్ని కోల్పోవడానికి జగన్ ఇష్టపడటం లేదు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదిక జగన్ తెప్పించుకుంటున్నారు. నియోజకవర్గాల్లో గ్రూపుల గోల, వర్గ విభేదాలను కూడా సహించబోనని జగన్ సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. తాను చేయాల్సింది తాను చేస్తున్నానని, మీరు చేయాల్సింది మీరు చేయాలని జగన్ ఎమ్మెల్యలతో జగన్ అన్నారు. తాను చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు సరిగా పనిచేయకపోతే రిజల్ట్ లో తేడా కొడుతుందని జగన్ సీరియస్ గానే ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. మూడేళ్ల తర్వాత... ఇక మూడేళ్ల వరకూ పెద్దగా పట్టించుకోని ఎమ్మెల్యేలపై వరాలు ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి రెండు కోట్ల అభివృద్ధి నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం 350 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ రెండు కోట్ల రూపాయలతో నియోజకవర్గాల అభివృద్ధికోసం వెచ్చించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల కింద ఈ నిధులను విడుదల చేయనుంది. ఈ నిధులను తమ నియోజకవర్గాల్లో ఉండే తక్షణ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులు చేయలేక వెనకడుగు వేస్తున్న ఎమ్మెల్యేల్లో ఈ నిధులు జోష్ పెంచాలనే జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సచివాలయానికి .... ఇక గ్రామ సచివాలయానికి కూడా ఇరవై లక్షలు జగన్ ప్రభుత్వం విడుదల చేయనుంది. ప్రతి నియోజకవర్గంలో 80 వరకూ గ్రామ సచివాలయాలు ఉంటాయి. అంటే ఒక్కొక్క నియోజకవర్గానికి 1.60 కోట్ల నిధులు కేటాయింపు జరుగుతుంది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ఈ నిధులను ఉపయోగిస్తారు. ఇప్పటి వరకూ జగన్ సంక్షేమాన్ని మాత్రమే పట్టించుకున్నారు. బటన్ నొక్కి లబ్దిదారులకు నగదును అందచేస్తున్నారు. ఇక రెండేళ్లు మాత్రమే ఎన్నికలు ఉండటంతో ఊహించినట్లుగానే అసంతృప్తిగా ఉన్న కొన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను తనవైపునకు తిప్పుకునేందుకు ఈ నిధులను విడుదల చేసినట్లే కనపడుతుంది. వరసగా రెండేళ్లు ఈ నిధులతో పాటు అదనపు అభివృద్ధి పనులను కూడా జగన్ చేపట్టనున్నారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం.

# అక్కల గాంధీ సారధ్యంలో జనసేన పార్టీ రచ్చబండ

## ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు జన సైనికులు పనిచేయాలి

విజయవాడ:ఉమ్మడి కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని జూపూడి, మూలపాడు, కేతనకొండ, కోటికలపూడి గ్రామాలలో జనసేన పార్టీ అధినేత, జనసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం జనసేన పార్టీ అధ్యక్షులు పోలిశెట్టి తేజ ఆధ్వర్యంలో జనసేన పార్టీ రచ్చబండ కార్యక్రమం లో పార్టీ సిద్ధాంతాలను, విధి విధానాలను, పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశాలను మండలం లోని ప్రతీ గ్రామానికి,ప్రతీ ఇంటింటికి తీసుకెళ్లాలని పార్టీ ప్రాముఖ్యత ను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కార్యకర్తలతో జనసేన రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రజలను వారియొక్క గ్రామ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు..మండలం లోని ప్రతి ప్రధాన సమస్యలపై జనసేనపార్టీ తరుపున ప్రశ్నిస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మైలవరం ఇంచార్జ్ రాష్ట్ర అధికార ప్రతినిది అక్కల రామ మోహన రావు (గాంధీ)మాట్లాడుతూ జనసేన పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం స్థాపించిన పార్టీ అని ప్రతి సామాన్యుడుకి మేలు జరగాలంటే జనసేన పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి లక్ష్మి కుమారి, కొమ్మరి హనుమంతరావు,వెంకటస్వామి, అశోక్, హరికిషోర్, నరేంద్ర, దుర్గారావు, కట్టాశ్రీను, పురం సురేష్ మరియు జనసేనపార్టీ ఇబ్రహీంపట్నం మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగిపోయిన కోర్టు నిర్మాణ పనులు తిరిగి చేపట్టాలి క న్నెగంటి జీవరత్నం



నందిగామ జూలై 20 ప్రజా పాలన ప్రతినిధి:పట్టణం లో లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి ఈ ఆగిపోయిన కోర్టు నిర్మా ణ పనులు తిరిగి చేపట్టాలని బార్ అసోసియేషన్ అ ధ్యక్షులు సీనియర్ న్యాయవాదులు కన్నెగంటి జీవ రత్నం ఆధ్వర్యంలో లాయర్లబృందం బుధవారంఆం ధ్రప్రదేశ్ హై కోర్ట్ జడ్జి మరియు ఉ మ్మడి కృష్ణా జిల్లా పోర్టఫోలియో జడ్జి.ప్రవీణ్ కుమార్ ని హై కోర్ట్ లోని వారి ఛాంబర్ లో కలుసుకొని నిర్మాణం మధలో నిలి చిపోయినసీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ మరియు అదన పు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ పనులను వేగవంతం గా జరిపించాలని విన్నవించగా జడ్జి వెంటనే స్పం దించి హై కోర్ట్ పరిపాలన రిజిస్ట్రార్ గారితో మాట్లాడి అనంతరం వెంటనే కృష్ణా జిల్లా ప్రిన్సిపాల్ జడ్జితో ఫోన్లో మాట్లాడి వెంటనే తగు చర్యలు తీసుకోవలసిం ది ఆదేశించారు.ఈ కార్యక్రమం లో సీనియర్ న్యాయ వాదులు మన్నెం నారాయణరావు, దాసరి వెంకటరా వు, ఉప్పులూరి జవహర్ బాబు, మందా వజ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న టెక్ట్స్ బుక్స్ విద్యాకానుక కిట్స్ వెంటనే ఇవ్వాలి: ఎస్ఎఫ్ఐ



నందిగామ జూలై 20 ప్రజా పాలన ప్రతినిధి: జగనన్న విద్యా కానుక కిడ్స్ కొన్ని రావాలని ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు వెంటనే వాటిని అందించాలని ఎస్ఎ ఫ్ఐ నాయకులు స్థానిక ఆర్డీవో రవీంద్రరావు కి వినతి పత్రం అందించారుఈ సందర్భంగా డివిజన్ కార్య దర్శి గోపి నాయక్ మాట్లాడుతూపెండింగ్ లో ఉన్న టెక్ట్స్ బుక్స్ విద్యాకానుక కిట్లు వెంటనే విడుదల చే యాలని, 3,4,5 తరగతులు విలీనం ప్రక్రియ ఆపాలని ,జీవో నెంబర్117ను వెంటనే రద్దు చేయాలని పాఠశా లలో సమస్యలు పరిష్కరించని.నందిగామ డివిజన్ లో కొన్ని పాఠశాలలను నాడు - నేడు ద్వారా అభివృ ద్ధి చేయాలని మరియు అదనపు తరగతి గదులు ని ర్మించాలి. జూలై 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పా ఠశాలలు ప్రారంభం కావడం నేపథ్యంలో పాఠశాలలో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ వ్యాప్తంగా కొన్ని జిల్లా పరి షత్ హైస్కూల్స్ ను నాడు - నేడు ద్వారా అభివృద్ధి చేయడం జరిగింది. కానీ పాఠశాలలో నాడు-నేడు పనులు జరగకపోవడంతో అనేక సమస్యలు ఉండ డంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అన్ని అన్నారు. స్కూల్స్ కి పూర్తిస్థాయిలో టెక్ట్స్ బు క్ రాలేదు 8వ తరగతి టెక్ట్స్ బుక్స్ ఇంకా ప్రింటింగ్ అవలేదు వెంటనే టెక్ట్స్ బుక్స్ సరఫరా చేయాలన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హసేన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మెగా వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహణకు ప్లాన్ చేయండి: జిల్లా కలెక్టర్



మచిలీపట్నం కలెక్టరేట్: 20 జులై ప్రజాపాలన :దేశవ్యాప్తంగా కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ఆర్టి పిసిఆర్టెస్ట వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు.భారత ప్రభుత్వ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆరోగ్య కార్యదర్శిబుధవారం ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ఆరోగ్య కార్యదర్శులతో, జిల్లా కలెక్టర్లతో నిర్వహించినవీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్ తమ నివాసం నుండి పాల్గొన్నారు. కోవిడ్ పాజిటివ్ రేట్పెరుగుతున్న దృష్ట్యా వివిధ రాష్ట్రాలలో కోవిడ్ పాజిటివ్ కేసులు ప్రస్తుత పరిస్థితి సమీక్షించి, కోవిడ్నియంత్రణకు తీసుకోవలసిన చర్యల గురించి వీడియో కాన్ఫరెన్సులో వివరించారు.అనంతరం జిల్లాలో కోవిడ్ నిర్వహణపై కలెక్టర్ వైద్యాధికారులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కోవిడ్ పాజిటివ్ రేట్ పెరుగుతున్న దృష్ట్యా జిల్లాలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలుపెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతించిన 18 ప్లస్ నుండి 59 సం. వరకువయస్సుల వారికి కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రీకాషనరీ డోస్ వేగవంతం చేయాలని నూరు శాతం కవర్చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కోవిడ్ కట్టడికి జిల్లాలో మెగా వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టాలని ఇందుకోసం కార్యాచరణరూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో విజయవాడ నగర సమీప మండలాల్లో కోవిడ్ పాజిటివ్ ఎక్కువుగా నమోదుఅవుతున్న కారణంగా జిల్లా పాజిటివ్ రేట్ పెరుగుతున్నదని, ఈ ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించికోవిడ్ నివారణ చర్యలు తీసుకుంటామని డిఎంఅండ్ హెచ్ డా. గీతాబాయి కలెక్టరుకు వివరించారు.కృష్ణాజిల్లాలో 25 మండలాల పరిధిలో గత ఏడాది జనవరి 16 నుండి ఇప్పటి వరకు హెల్త్కేర్ వర్కర్స్, ఫ్రంట్ లైన్ వర్కర్స్, 12-14 సం., 15-17సం., 18-44 సం., 45-59 సం., 60 సం.పైబడిన వారికి అందరికి కలిపి మొత్తం మొదటి డోస్ 14,95,326 మందికి, రెండవ డోస్ 16,85,921మందికి, ప్రీకానరీ డోస్ 2,13,082 మందికి వ్యాక్సినేషన్ వేయడం జరిగిందన్నారు.

# టిడ్కో ఇళ్ళు టిడిపి లబ్ధి దారులకు మొండి చెయ్యి...





మచిలీపట్నం : 20 జులై ప్రజాపాలన :మచిలీపట్నం నగరంలో నిర్మించిన టిడ్కో ఇళ్ళు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లయినాఇంకా స్వాధీనపరచలేదు. గో సంఘం, రుద్రవరంలో సేకరించారు. ఇళ్ళకు అడ్వాన్సు చెల్లించి రిజిష్టర్ చేయించుకున్న 4176 మందికి టిటిడి కళ్యాణ మండపంలో అప్పటి మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో లాటరీ తీసి ఫ్లాట్లను కేటాయించారు. మూడు కేటగిరీలలో టిడ్కో ఇళ్ళను నిర్మించారు. 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల ఫ్లాట్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఎన్నికలు రావడంతో కోడ్ అమలులో ఉన్నందున లబ్ధిదారులకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇళ్ళను స్వాధీన పరచలేకపోయారు. వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ళపై రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ప్రారంభించారు. 4176 ఇళ్ళ నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 1872 ఇళ్ళ నిర్మాణాలు పునాదుల్లోనే ఉండిపోయాయి. పునాదుల్లో నిలిచిపోయిన ఇళ్ళ నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదు. మిగిలిన 2304 ఇళ్ళు మాత్రమే లబ్ధిదారులకు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిడిలు చెల్లించిన 1872 మందికి ఇళ్ళకు మారుగా కరగ్రహారం లో ప్లాట్లు ఇస్తామని అధికారులు చెబుతూ వచ్చారు. సొంత ఇల్లు ఆశించిన లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.వడ్డీకి అప్పులు తెచ్చి రెండు నుంచి నాలుగు ఇన్స్టాల్మెంట్లు చెల్లించిన లబ్ధిదారులు ఉన్నారు. అయితే మచిలీపట్నంనగర పాలక సంస్థలో 50 డివిజన్లకు గాను 44 మంది వైసీపీ కార్పొరేటర్లు గెలవడంతో ఎవరికి వారు తమఅనుయాయు లకే ఇళ్ళు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇన్స్టాల్మెంట్లు చెల్లించిన టీడీపీసానుభూతి పరులకు ఇళ్ళు ఇవ్వమంటూ వాలంటీర్లు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం మారేసరికి నిబంధనలుమారతాయా అంటూ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తాజాగా టిడ్కో ఇళ్ళను ఒక్క రూపాయితోరిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పడంతో లబ్ధిదారులకు పట్టాలు ఇస్తున్నారు. ఫ్లాట్లు కేటాయిస్తున్నారు. గతంలో టీడీపీలాటరీ తీసి ఇచ్చిన ఫ్లాట్ల జాబితా తారుమారయింది. 2304 మంది లబ్ధిదారులు కేవలం వైసీపీకి ఓటు వేసిన వారికేఇస్తామంటూ వాలంటీర్లు చెబుతున్నారు. వాలంటీర్లు చెప్పే మాటలు నిజం కావని సచివాలయాల్లోని అడ్మిన్లుచెబుతున్నప్పటికీ జాబితాల్లో టీడీపీ సానుభూతిపరుల పేర్లు గల్లంతవుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన 2304 మందికి మాత్రమే ఫ్లాట్లు కేటాయిస్తూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మా సంగతేమిటని నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ఫ్లాట్లు కేటాయించని లబ్ధిదారులు టౌన్ ప్లానింగ్ సెక్షన్ చుట్టూ తిరుగుతున్నారు.సచివాలయ కార్యదర్శులు ఎంపికైన పట్టాలు పొందిన లబ్ధిదారులను వరుసగా రిజిష్టార్ కార్యాలయానికి తీసుకువెళ్ళి టిడ్కో ఇళ్ళను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. యుద్ధప్రాతిపదిక మీద రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రోజుకు పది మంది కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్లు కావడం లేదు. ఈ నేపథ్యంలో డబ్బు చెల్లించి కమిషనర్ పేర డిడిలు తీసినలబ్ధిదారులు టౌన్ప్లానింగ్ సెక్షన్కు వెళ్ళి మాకు రిజిస్ట్రేషన్లు ఎప్పుడు చేయిస్తారని అడుగుతున్నారు. మీ పేర్లుజాబితాల్లో లేవు, మీకు డబ్బు వెనక్కి తిరిగిచ్చేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు కన్నీరుమున్నీర వుతున్నారు. గో సంఘంలో లాటరీలో తమకు కేటాయించిన ఇల్లును చూసి మురిసిపోతున్న లబ్ధిదారులకు కరగ్రహారంలో సెంటు స్థలం ఇచ్చామని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమ కష్టాలు ఎవరితోచెప్పుకోవాలో తెలియక తలలు బాదుకుంటున్నారు. గో సంఘంలో 300 చ.అ 192, 400 చ.అ 672 ఉన్నాయి. ఇలాఈ 864 ఫ్లాట్ల లబ్ధిదారుల జాబితాలు తయారు చేశారు. వాటిని సచివాలయాల్లో ప్రదర్శించారు. అదే విధంగా రుద్రవరంలో 1440 ఫ్లాట్లను కేటాయించారు. 300 చ.అ ప్లాట్లు 1152, 365 చ.అ ఫాల్లు 240, 430 చ.అ ఫ్లాట్లు 47కేటాయించారు. ఇలా 1440 ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టారు. కాగా తాజా ఉత్తర్వుల ప్రకారం 300 చ.అ ఫ్లాట్లుకేటాయించిన వారికి ఉచితంగా ఇస్తామని, వారు కట్టిన డబ్బు తిరిగి ఇచ్చేస్తామని అధికారులు చెబుతున్నారు. 360చ.అ ఫ్లాట్ల లబ్ధిదారులు, 430 చ.అ లబ్ధిదారుల ఫ్లాట్లకు లబ్ధిదారులు చెల్లించిన సొమ్ముతో పాటు అదనంగా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే ప్రక్రియపై మెప్మా అధికారులు దృష్టి సారించారు. ఇలా బ్యాంకు రుణాలు ఇచ్చినవారికి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఈ రిజిస్ట్రేషన్లు గో సంఘం లబ్ధిదారులకు ముందుగా చేస్తున్నారు. అయితే రుద్రవరంలోని లబ్ధిదారుల రిజిస్ట్రేషన్లకు కొన్ని న్యాయపరమైన చిక్కులు రావడంతో ఆ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వాయిదావేశారు. బేస్మెంట్ లెవెల్లోనే మిగిలిపోయిన 1872 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి లాటరీ తీసిన లబ్ధిదారులకు ఇళ్ళుఇవ్వాలని లబ్ధిదారులు చాలా మంది కోరుతున్నారు. అయితే ఇళ్ళు లేనందున కరగ్రహారంలో ఫ్లాట్లు తీసుకోవాలనిప్రత్యామ్నాయంగా అధికారులు చెబుతున్నారు. ఇందుకు చాలా మంది లబ్ధిదారులు సెంటు స్థలం తీసుకునేందుకు అంగీకరించడం లేదు. అయితే గత్యంతరం లేక పేదలు సెంటు స్థలానికే అంగీకార పత్రాలు సమర్పిస్తున్నారు. అలాఅంగీకార పత్రాలు ఇవ్వని లబ్ధిదారులకు సచివాలయాల్లోని సిబ్బందికి మధ్య వాగ్వివాదాలు ఏర్పడుతున్నాయి. ఈ ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేస్తేనే ఈ సమస్యకు నిజమైన పరిష్కారం ఏర్పడుతుంది.

## సంక్షేమాభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా జగనన్న ప్రభుత్వం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి సంక్షేమాభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం 27 వ డివిజన్ 197 వ వార్డు సచివాలయం పరిధి బావాజీపేటలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొండాయిగుంట మల్లీశ్వరి బలరాం, పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు సచివాలయ పరిధిలోని 939 గృహాలలో, 308 గడపలను సందర్శించారు. ప్రజా సమస్యలతో పాటు వ్యాక్సినేషన్ పై ఆరా తీశారు. తొలి రెండు డోసులను పూర్తిచేసుకున్న ప్రతిఒక్కరూ బూస్టర్ డోస్ కూడా తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. హెల్త్ సెంటర్లకు రాలేని పరిస్థితిలో ఇంటి వద్దనే వారికి వ్యాక్సిన్ అందించేలా ఆరోగ్య మిత్రలు, హెల్త్ సెక్రటరీలు చొరవ చూపాలన్నారు. పలు వీధులలో క్రిందికి వ్రేలాడుతున్న విద్యుత్ తీగలను గమనించిన ఆయన వెంటనే వాటన్నింటినీ పైకి మార్చాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వీధులలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. గృహ యజమానుల నుంచి తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకర చెత్తలను వేర్వేరుగా సేకరించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. బావాజీపేటలో యూజీడీ, నూతన రోడ్ల నిర్మాణానికి రూ. 45.70 లక్షల నిధులు మంజూరు అయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. వీటితో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన మౌలిక సదుపాయాల కల్పనకు ఒక్కో సచివాలయానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. కలెక్టర్ నేతృత్వంలో ప్రాధాన్యత క్రమంలో పనులు జరుగుతాయని తెలియజేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో దాదాపు రూ. 20 కోట్ల నిధులు ఇందుకోసం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. పేదలకు పెద్దఎత్తున అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక తెలుగుదేశం నాయకులు ఏడుపే ఏడుపు కార్యక్రమాలు మొదలు పెట్టారని మల్లాది విష్ణు విమర్శించారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్(ఇంఛార్జి) అంబేద్కర్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, వైసీపీ కార్పొరేటర్ బాలిగోవింద్, నాయకులు భోగాది మురళి, బొప్పన గాంధీ, వి.బి.ఆచారి, కొరిటి శివ, కనుగుల బాల, కనపర్తి కొండా, లంకా కుమార్, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నెలలో రెండుసార్లు కళాశాలలను తనిఖీ చేయాలి



నరసాపురం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి) :ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందించేందుకు జిల్లా మానిటరింగ్ అండ్ సూపర్ వైజింగ్ కమిటీ విరివిగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా జాయింటు కలెక్టర్ జె.వి. మురళి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మానిటరింగ్ అండ్ సూపర్ వైజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింటు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కార్పొరేట్ కళాశాలలన్నిటిని తనిఖీ చేసి కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు ఏవిధమైన విద్యను అందిస్తున్నారో నివేదికను అందజేయాలని ఆయన సూచించారు. ఇంటర్మీడియట్ కళాశాలలలో ఒత్తిడితో కూడిన విద్యను బోధించినట్లయితే ఆకళాశాలకు నోటీసులు జారీ చెయ్యాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలలో రెండుసార్లు కాలేజీలకు తనిఖీకి వెళ్లాలని జాయింటు కలెక్టరు జె వి మురళి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసరు వి. శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఐసిడిఎస్ పి.డి సుజాతరాణి, ఫైర్, ఫుడ్ సేఫ్టీ తదితర అధికారులు పాల్గొన్నారు.



ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 21, జులై 2022

## ఆవు పేడ బంగారం కాలేదు

బీజేపీ విధానాలు ఎంత తలాతోకా లేకుండా ఉంటాయో తెలుసుకోవాలంటే ఒకసారి ఆ పార్టీ ఆరేండ్లుగా అధికారంలో ఉన్న యూపీకి వెళ్లాల్సిందే. పశు వధశాలలను, పశువుల మార్కెట్లను గో రక్షణ పేరుతో యోగి ప్రభుత్వం మూసివేసింది. ఫలితంగా లక్షలాది పశువులు పొలాల మీద పడ్డాయి. రోడ్లమీదికి గుంపులుగా వస్తూ ప్రమాదాలకు కారణమయ్యాయి. ఇది ఆ రాష్ట్రంలో పెద్ద సమస్యగా మారటంతో, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో యోగి, మోదీ దీనిపై వాగ్దానాలు గుప్పించారు. ఆవుపేడను బంగారంగా మార్చి ఆ సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. ఎన్నికలు పూర్తయి, బీజేపీ గెలిచి నాలుగు నెలలైంది. మరి ఆ సమస్యకు పరిష్కారం ఏమైందో మీరే చదవండి. ఈ ఏడాది జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా, ఆ రాష్ట్రంలో రైతాంగానికి కునుకు పట్టకుండా చేస్తున్న వీధి పశువుల సమస్యను పరిష్కరిస్తానని ప్రధానమంత్రి హోదాలో మోదీ వాగ్దానం చేశారు. ఆవు పేడను కూడా పెట్టుబడిగా మారుస్తామన్నారు. కానీ, ఎన్నికలు ముగిశాయి. యోగి రెండోసారి సీఎం అయి 120 రోజులు దాటింది. కానీ, ఇప్పటి వరకూ ఆ హామీ ఊసే లేదు. ఇంతకూ సమస్యేమిటో తెలియాలంటే.. ఐదేండ్ల వెనక్కి వెళ్లాలి. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, నాడు అధికారంలో ఉన్న సమాజ్‌వాదీపార్టీ ప్రభుత్వం గద్దె దిగి బీజేపీ అధికారంలోకి వచ్చింది. యోగి ఆదిత్యనాథ్ సీఎం అయ్యారు. గోవుల రక్షణ పేరుతో పశు వధశాలలను మూసేశారు. పశువుల తరలింపుపై అనేక ఆంక్షలు విధించారు. ఎవరైనా తరలిస్తే వారిపై అసాంఘికశక్తులు దాడి చేయటం, ఆ మూకల మీద ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం సాధారణ విషయమైపోయింది. దీంతో రాష్ట్రంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న పశువుల మార్కెట్లు అస్తవ్యస్తమైపోయాయి. ఆ రంగంపై ఆధారపడిన లక్షలాదిమంది ఉపాధి కోల్పోయారు. అయితే, ఇదొక పార్శ్వం మాత్రమే. వ్యవసాయానికిగానీ, పాడికిగానీ పనికి రాని పశువులను గతంలో రైతులు వధశాలలకు తరలించేవారు. లేదా, పశువుల వ్యాపారులకు విక్రయించేవారు.కానీ, వా టిపై నిషేధం నేపథ్యంలో, ఆ పశువులను ఇంటి వద్ద పెట్టుకొని మేపలేక, వీధుల్లో వదిలేయటం ప్రారంభించారు. దీంతో వందలు, వేల, లక్షల సంఖ్యలో పశువులు రోడ్ల మీద, వీధుల్లో విచ్చలవిడిగా తిరగటం ప్రారంభమైంది. పంటపొలాల మీది పడి ధ్వంసం చేయటం, అడ్డం వచ్చిన వారిపై దాడి చేయటం నిత్యకృత్యమైంది. నడిరోడ్ల మీద పశువులు గుంపులుగా తిరుగుతుండటంతో అనేక ప్రమాదాలు జరిగి ఎంతోమంది వికలాంగులయ్యారు. ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో వీధిపశువుల సంఖ్య 12 లక్షలకు పెరిగిపోయింది. వీటితో విసిగిపోయిన గ్రామస్థులు, రైతులు పశువులను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోకి తరలించి, బంధిస్తున్నారు. దీంతో స్కూల్‌లో చదువుకోవటానికి విద్యార్థులకు చోటు లేకుండా పోతున్నది. యూపీలో ఇదొక ఎన్నికల అంశంగా మారటంతో, మొన్నటి ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరిలో ప్రధాని మోదీ దీనిపై హామీలు గుప్పించారు. ఈ సమస్యను పరిష్కరించే ఒక పథకం తన మదిలో ఉన్నదని, ఎన్నికల కోడ్ అడ్డంగా ఉన్నందువల్ల దాని గురించి చెప్పటం లేదని, మార్చి 10న ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణమే తెలియజేస్తానని నమ్మబలికారు. కానీ, ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు గడిచింది. కానీ, అటు మోదీగానీ, ఇటు యోగి గానీ ప్రజలకు ఇచ్చిన హామీ ఊసెత్తటం లేదు. ఇంతకూ మోదీ ప్రస్తావించిన పథకం ఏమిటంటే.. అప్పటికే ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'గోదాన్ న్యాయ్ యోజన' పేరిట అమలు చేస్తున్నదే. వీధి పశువుల వల్ల పంట నష్టం జరిగితే ఎకరాకు రూ. 3 వేల పరిహారం ఇవ్వటం, పిడకలను కిలో రూ.2 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయటమే ఈ పథకం. అంటే, పథకం కూడా బీజేపీ సొంతది కాదు. అది కూడా కాపీ పథకమే. అయినా, దానినీ అమలులో పెట్టలేదన్నమాట. ఈ హామీల సంగతి ఎలా ఉన్నా.. రాష్ట్రంలో పెనుసమస్యగా దాపురించిన వీధి పశువుల పరిష్కారానికి యోగి ప్రభుత్వం గత ఐదేండ్లలో కొన్ని చర్యలను ప్రకటించింది. వాటిలో ఒకటి, గోశాల ఏర్పాటుచేసి పశువులను సంరక్షిస్తే, ఒక్కొక్క పశువుకు రోజుకు రూ.30 చొప్పున గోశాల నిర్వాహకులకు సాయం అందిస్తామని చెప్పింది. ఇది ఎలా అమలైందో తెలుసుకోవాలంటే దేవరియాలో గోశాల ఏర్పాటుచేసిన ముఖేశ్ కుమార్ మాటలు వినాల్సిందే. 'ఐదేండ్లలో మూడుసార్లు మాత్రమే చెల్లించారు. అది కూడా అధికారులు రూ.30లో దాదాపు 30 శాతం కమీషన్ తీసుకొని రూ.22 మాత్రమే ఇచ్చేవారు' అని ఆయన వాపోయారు. గోశాలలను ఏర్పాటు చేస్తే డబ్బులతోపాటు పశువులకు దాణా కూడా సరఫరా చేస్తామన్న ప్రభుత్వ ప్రచారంతో అనేకమంది వాటిని ఏర్పాటు చేశారు. కానీ, అటు డబ్బులూ అరకొరగా ఇవ్వటమేగాక ఇటు దాణా ఊసే లేకుండా పోయింది. దీంతో వాటి నిర్వహణభారం మోయలేక అనేకమంది నిర్వాహకులు చేతులెత్తేశారు. గోశాలల్లో పరిశుభ్రమైన పరిస్థితులు లేక, దాణా లేక, కిక్కిరిసిపోయిన పరిస్థితుల్లో అనేక పశువులు మృత్యువాత పడ్డాయి. బీజేపీ ప్రవచించే గోరక్షణ.. యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉన్న యూపీలో అమలైన తీరు ఇదీ. గోశాలల పరిస్థితి ఇలా ఉంటే, యోగి సర్కారు యూపీ రైతులకు మరిన్ని హామీలు కూడా ఇచ్చింది. ఉదాహరణకు, పేడను ఇంధనంగా మార్చే బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రోత్సాహకాలు ఇస్తామని, పశువుల దాణా బ్యాంకులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏదీ ఆచరణకు నోచుకోలేదు. ఈ విధంగా శతాబ్దాలుగా మనుగడలో ఉన్న వ్యవస్థను ధ్వంసం చేశారు. తమ అభిప్రాయాలను కోట్లాదిమంది ప్రజలపై రుద్దారు. దానివల్ల లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. కోట్లాది మంది నష్టపోతున్నారు. వందలాది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయినా కూడా వారిలో పశ్చాత్తాపం లేదు. ఉన్న వ్యవస్థను ధ్వంసం చేసిన వారికి కొత్త వ్యవస్థను సృష్టించే తెలివితేటలైనా ఉన్నాయా అంటే అదీ లేదు. ఇదీ బీజేపీ మోడల్, డబుల్ ఇంజిన్ సర్కారు పనితీరు.

# మోదీ జవాబివ్వలేని ప్రశ్నలు!



వాల్మీకి రామాయణం సుందర కాండలో సీతమ్మవారిని దర్శనం చేసుకున్న హనుమంతుడు, ఆమెను రావణుడు లంకలోకి తెచ్చి దాచిన విషయం గోప్యంగా వుంచాడని, తానిప్పుడు బహిర్గతం చేస్తున్నానని, అది రావణ వినాశనానికి నాంది అని అంటాడు. అలాగే రావణుడి కొలువులో హనుమ ఆయన్ను ఉద్దేశించి మాట్లాడుతూ అంతవరకూ ఆయన చేసిన పుణ్యాన్ని అనుభవించాడని, ఇక ముమ్ముందు పాపం అనుభవించాల్సి వుందని హెచ్చరించాడు. ఇందులో ఒక సందేశం వుంది. ఒక ప్రభుత్వం కానీ, ప్రభుత్వాధినేత కానీ, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా తీసుకునే నిర్ణయం ఎల్లకాలం గోప్యంగా వుంచడం సాధ్యం కాదు. అలాగే, ఎవరూ సుదీర్ఘకాలం తాను అది చేశా ఇది చేశా అని చెప్పుకుని అధికారంలో వుండలేరు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని మోదీపైన చేసిన వ్యాఖ్యలు గమనిస్తే, తప్పటడుగు వేస్తున్న ప్రభుత్వాధినేతల బండారాన్ని ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకప్పుడు బయటపెట్టే సమయం రాకపోదనేది స్పష్టంగా అర్థమవుతున్నది. జూలై 10న హైదరాబాద్ ప్రగతిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్ కేంద్ర ప్రభుత్వ గణాంకాలతోనే కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని సోదాహరణంగా విమర్శించారు. భారతదేశ దేశ చరిత్రలో అత్యంత అసమర్థ ప్రధాన మంత్రి మోదీ అనీ, ఆయన ఎనిమిదేళ్ల పాలనలో దేశమంతా అవినీతేననీ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడమే మోదీకి తెలిసిన రాజధర్మం అనీ, మోదీ హయాంలో క్యాపిటల్ డ్రెయిన్‌కు భారతదేశం ముందు వరుసలో నిలిచిందనీ, న్యాయమూర్తులను పాత్రికేయులను బెదిరిస్తున్న అహంకారపూరిత ప్రభుత్వం ఇదేననీ, దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని మోదీ అమలుపరుస్తున్నాడనీ, కొందరు ఎంపిక చేసిన వ్యాపారులకు మోదీ సేల్స్‌మ్యాన్ లాగా వ్యవహరిస్తున్నారనీ... ఇలా మరెన్నో నగ్న సత్యాలను భారతదేశ ప్రజల ముందూ, యావత్ ప్రపంచం ముందూ నిర్భయంగా బహిర్గతం చేశారు కేసీఆర్. ఇలాంటి ప్రభుత్వం ఇక ఎక్కువ కాలం అధికారంలో ఉండడానికి తగదని స్పష్టం చేశారు. దాని మనుగడ ప్రశ్నార్థకం అని చెప్పకనే చెప్పారు. కేసీఆర్ మీడియా సమావేశంలో చేసిన ప్రసంగం విన్నవారికి, మర్నాడు వార్తాపత్రికలలో చదివినవారికి అర్థమయ్యే విషయాలు చాలా ఉన్నాయి. అందులో ప్రధానమైనవి: బీజేపీకి పాలన చేతకాదు. ఎనిమిదేండ్ల పాలనలో మోదీ సర్కారు ఏ వర్గానికీ మంచి చేయలేకపోయింది. జాతీయంగా, అంతర్జాతీయంగా బీజేపీ ప్రజ్వలింప చేస్తున్న సంకుచిత విష ప్రచారానికి తప్పకుండా విరుగుడు కావాలి. లేకుంటే దేశం పెద్ద ప్రమాదంలో పడుతుంది. ఎనిమిదేళ్ల మోదీ పాలనలో వ్యవసాయరంగంలో కాని, విద్యుత్తు రంగంలో కాని, సాగునీటి రంగంలో కాని, ఒక్క మంచి పని జరగలేదు. దేశానికి కరెంటు ఇవ్వడం, సాగునీళ్లు ఇవ్వడం, కనీసం మంచినీళ్లైనా ఇవ్వడం చేతకాని ప్రభుత్వం ఇది. దేశ రాజధాని ఢిల్లీలోనే మంచినీళ్లు లేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొన్నది. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిలో కనీసం 20శాతం కూడా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరగడం లేదు. నిత్యావసరాల ధరలు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పెరుగుతున్నాయి. దేశంలో ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగం గరిష్ఠస్థాయికి పెరిగిపోయింది. విదేశీ మారకద్రవ్యం నిల్వలు హారతికర్పూరంలా కరిగిపోతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుదల, ధరల పెరుగుదల ఆగడం లేదు. రూపాయి దారుణంగా పతనమైంది. ఇంత జరుగుతున్నప్పటికీ ఇప్పటికిప్పుడు బీజేపీని పడగొట్టే ఆలోచన కేసీఆర్‌కు లేదు. వాళ్ల అహంకారం ఇంకా పెరగాలని, తప్పులు ఇంకా చెయ్యాలని, గ్యారంటీగా చేస్తారని, ఆ రోజు కోసం ఎదురుచూస్తామని అన్నారు కేసీఆర్. దానికొరకు అవసరమైతే జాతీయ పార్టీగా టీఆర్ఎస్ రూపాంతరం చెందుతుందని కేసీఆర్ సూచన ప్రాయంగా చెప్పారు. మహారాష్ట్రలో మాదిరి ఏక్‌నాథ్‌షిండే ప్రయోగం తమిళనాడులో కానీ, తెలంగాణలో కాని అప్రజాస్వామికంగా, నిరంకుశంగా చేస్తే ప్రజలు గట్టిగా సమాధానం ఇస్తారని హెచ్చరించారు. 75 ఏండ్లుగా దేశంలో కాంగ్రెస్ మీద బీజేపీ, బీజేపీ మీద కాంగ్రెస్ బ్లేమ్ గేమ్ ఆడుతున్నాయి. 75 ఏండ్ల రొటీన్ రాజకీయాల నుంచి దేశం బయటపడాలి. అప్పుడు ప్రబలమైన మార్పులు వస్తాయి. ప్రజలకు మేలుకూర్చే అన్ని రంగాల్లో దేశానికి స్వావలంబన శక్తిని తీసుకొచ్చే విధంగా, సింగపూర్, చైనా దేశాల్లోలాంటి నాయకత్వం దేశానికి కావాలి. భారత దేశంలో ఉన్నంత యువశక్తి ప్రపంచంలో మరే దేశంలో లేదు. అద్భుతమైన ప్రగతిబాటలో పయనింపచేయాల్సిన యువతలో మతపిచ్చిని లేపుతున్నది బీజేపీ ప్రభుత్వం. దేశప్రగతిపై గంభీరమైన దృక్పథం గానీ, అవగాహన గానీ, సరైన వ్యూహం గానీ బీజేపీ దగ్గర లేవని ఈ ఎనిమిదేళ్లల్లోనూ ఋజువు చేసుకున్నారు. సంకల్పం, గొప్ప నాయకత్వం ఉంటే, గుణాత్మక మార్పు అంటే ఏమిటో భారత ప్రజానీకానికి వివరించి, వారిని అభివృద్ధి బాటలో పయనింపజేయవచ్చు. ఆ దిశగా అవసరమైతే టీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారుతుంది. ఈ దేశానికి కొత్త అభివృద్ధి ఎజెండా కావాలి. దేశ రాజకీయాల నుంచి బీజేపీని తన్ని తరిమేయాలి. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రజల కోసం, దేశ భవిష్యత్తు కోసం కచ్చితంగా కేసీఆర్ ఒక పాలసీ ప్రకారం బీజేపీని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నారు. ఒక్క విషయంలో నరేంద్రమోదీకి, బీజేపీకి థ్యాంక్స్ చెప్తున్నానంటూ డబుల్ ఇంజిన్ సర్కార్ తప్పక రావాలన్నారు కేసీఆర్. తెలంగాణ ప్రభుత్వం స్పీడ్ ఎక్కువ ఉన్నదని, కేంద్ర ప్రభుత్వం స్పీడ్ తక్కువ ఉన్నదని, కాబట్టి కచ్చితంగా డబుల్ ఇంజిన్ సర్కార్ కావాలని, కేంద్రంలో ఇప్పుడున్న సర్కారు పోయి తెలంగాణ లాంటి సర్కారు రావాలని మోదీ మాట మోదీకే అప్పచెప్పారు కేసీఆర్. ప్రజాస్వామ్యంలో నేతలను గెలిపించేది, ఓడించేది ప్రజలే. ఎవరైనా 'ఓడిస్తా' అంటూ మాట్లాడారంటే అది వారి అహంకారానికి, అవివేకానికి నిదర్శనం. బీజేపీ వాళ్లకు దమ్ముంటే డేట్ ఫిక్స్ చేయమని, తాను అసెంబ్లీ రద్దు చేస్తానని, చిల్లర రాజకీయాలు మాట్లాడకూడదని, ఇది పద్ధతి కాదని, ఇకనైనా మార్చుకోవాలని హితవు పలికారు కేసీఆర్. దేశంలో బ్యాంకు మోసాలన్నీ ప్రధాని నరేంద్రమోదీకి తెలిసే జరుగుతున్నాయని సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేసి, ఆ వివరాలన్నీ త్వరలో దేశం ముందుపెడతానని హెచ్చరించారు. బ్యాంకు లూటీల్లో మోదీ వాటా ఎంతని నేరుగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిదేండ్లలో ఒక్క బ్యాంకు దొంగను కూడా ఎందుకు వెనక్కి తీసుకురాలేక పోయిందని నిలదీశారు. ఈడీలు, సీబీఐలు, ఇతర కేంద్ర సంస్థలు బ్యాంకు దొంగలను ఎందుకు పట్టుకోవడం లేదని, రైతులకు సబ్సిడీ ఇయ్యొద్దు, కరెంటు సబ్సిడీ ఇయ్యొద్దు, మీటర్లు పెట్టాలె... అనే ప్రభుత్వం కొందరికి లక్షల కోట్లు దోచిపెట్టాల్నా అని ప్రశ్నించారు కేసీఆర్. తెలంగాణలో రైతులు పండించిన ధాన్యం కేంద్రం కొనని విషయాన్ని ప్రస్తావించిన కేసీఆర్, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ మీద మోదీ ప్రభుత్వానికి అవగాహన లేనే లేదన్న విషయాన్ని బహిర్గతం చేశారు. లక్షల కోట్ల పెట్టుబడులు విదేశాలకు తరలిపోతున్నాయని, ఫలితంగా దేశంలో విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయని, మోదీ విదేశాలు తిరిగి, గుప్పెడుమంది పెట్టుబడిదారులకు సేల్స్‌మ్యాన్‌గా పని చేసి, వారికి బిజినెస్ ఇప్పించారని, మేకిన్ ఇండియా అట్టర్ ఫ్లాప్ అని.... ఇలా కేసీఆర్ విమర్శల్లో ఎన్నో కోణాలున్నాయి.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని మేల్కొల్పుతామని, బీజేపీని గద్దె దించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని కేసీఆర్ అత్యంత విశ్వాసంతో, ధైర్యంగా చెప్పడాన్ని విశ్లేషిస్తే, కేంద్రంలో మార్పు తథ్యమనే నమ్మకం ప్రజల్లో బలీయంగా కలుగుతున్నది. ప్రధాని మోదీ గురించి సీఎం కేసీఆర్ నిర్భయంగా వాస్తవాలు చెప్పారని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ప్రశంసించారు. మోదీపై చేసిన విమర్శలను స్వాగతిస్తూ ఆయన ట్వీట్ చేశారు. మీడియా సమావేశంలో ప్రధానిపై సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలతో అంతర్జాతీయ వార్తాసంస్థ 'బ్రట్' రూపొందించిన వీడియోను ప్రశాంత్‌భూషణ్ షేర్ చేశారు. కేసీఆర్ మీడియా సమావేశంలో ప్రస్తావించిన విషయాలమీద దేశవ్యాప్తంగా రాజకీయ విశ్లేషకులు ఆసక్తి కనపరుస్తున్నారు.

# అరుదయిన స్వరం అపురూప గానం..

'హొజో షాయర్ థా చుప్ సా రహతాథా... బైటే బైటే సీ బాతే కహతాతా', 'ఆంఖే కానో పే రఖ్ కే సున్‌థాథా... గూంగే ఖామో షి యోన్ కే అవాజ్ సున్‌థాథా..' లాంటి గుల్జార్ గీతాలను 1980లో ఆలపించిన భూపేందర్ సింగ్ స్వరం శ్రోతలను మరో లోకంలోకి తీసుకెళ్ళింది. ఆ గంభీర స్వరానికి తోడు ఎలెక్ట్రిక్ గిటార్, డ్రమ్స్ లాంటి ఆధునిక సంగీత పరికరాలు ఆ పాటలకు గొప్ప ఉద్విగ్నతను సంతరింపచేసాయి. సాహితీ సంగీతాల మేళవింపయిన ఆ ఆల్బం నేటికీ శ్రోతల గుండెల్లో పదిలంగానే వుంది. కేవలం ఆ ఆల్బమే కాదు ఇటు సినీ సంగీత ప్రపంచం లోనూ మరోవైపు గజల్ లోకంలోనూ సుస్థిర మయిన స్థానాన్ని పొందిన భూపేందర్ సింగ్ సోమవారం (18 జూలై) ముంబైలో తనువు చాలించారు. సినీ సంగీత ప్రపంచం ఓ అరుదయిన స్వరాన్నీ, ప్రయోగశీలినీ కోల్పోయింది. రఫీ, కిషోర్ కుమార్, మన్నాడే, ముఖేష్ లాంటి లెజెండ్రీ గాయకుల మధ్య తన అరుదయిన స్వరం, అపురూపమయిన దుఃఖగాంభీర్యాన్ని పలికించిన భూపేందర్ సింగ్ తన ముద్రను మిగిల్చిపోయాడు. అమృత్‌సర్‌లో 1940లో జన్మించిన ఆయన పాడిన పాటలు ఒకటా రెండా 'మౌసం' సినిమాలో 'దిల్ డూండ్ తా హై..', 'కినారా'లో 'నాం ఘుం జా యే గా చహారా యే బాదల్ జా యే గా.. మేరి అవాజ్ హీ పహచాన్ హై..' లాంటివి శిఖరాగ్రాన నిలిచాయి. అట్లా శాశ్వత కీర్తిని సంపాదించుకున్న అనేక పాటలు పాడిన భూపేందర్ సింగ్ తన వృత్తి జీవితాన్ని మొదట ఆల్‌ఇండియా రేడియోలో ఆరంభించాడు. చిన్నప్పటి నుండే సంగీతకారుడయిన తన తండ్రి వద్ద సంగీతాన్ని అభ్యసించాడు. గిటార్ వాయించడం అప్పుడే నేర్చుకున్నాడు. తర్వాత గిటార్ వాయిద్యం భూపేందర్ సింగ్ సంగీత యాత్రలో ఆయనతోనే వుండిపోయింది. మొదటి నుండీ గజల్స్ పైన మక్కువ వున్న భూపేందర్ సింగ్ చిన్నప్పుడే వార్తా పత్రికల్లో వచ్చే రచనలకు సంగీత బాణీలు కట్టి తన మిత్రులకు వినిపించేవాడు. తర్వాత ఢిల్లీ ఆల్ ఇండియా రేడియోలో సంగీతకారుడిగా చేరిపోయాడు. అప్పుడే రేడియోలో బహదూర్ షా జఫర్ ఉత్సవాల్ని నిర్వహిస్తున్నారు. దాని కోసం భూపేందర్ సింగ్ 'లగ్ తా నహీ జీ మేరా..' గజల్ని రికార్డ్ చేసాడు. అది కాస్తా సూపర్ హిట్ అయింది. ఆ గజల్‌ను విన్న ప్రముఖ హిందీ సినిమా సంగీత దర్శకుడు మదన్ మోహన్ భూపేందర్ సింగ్‌కు తన సినిమా హాకీఖత్‌లో పాడే అవకాశం ఇచ్చాడు. ఆ పాటను రఫీ, తలత్ మహమూద్, మన్నాడేలతో కలిసి పాడాడు. తర్వాత రెండేళ్లకు ఖయ్యాం నిర్దేశకత్వంలో ఆఖరీ ఖత్ సినిమాలో భూపేందర్ సింగ్ 'రూత్ జవా.. జవా రాత్ మహారుబా..' పాటతో సోలోగీతం పాడి తనను తాను నిరూపించుకున్నాడు. తర్వాత భూపేందర్ సింగ్ ఎస్డీ బర్మన్ సంగీతంలో 'జెవెల్ తీఫ్' సినిమాలో లతామంగేష్కర్‌తో కలిసి పాడిన యుగళగీతం 'హొటో పే ఐసీ బాత్ చెలి ఆయీ..' పాట గొప్ప హిట్. ఇక 'మౌసం' సినిమాకోసం గుల్జార్ రాసిన 'దిల్ డూండ్ తా హై..', నేటికీ ఉద్విగ్నభరితమయిన విరహగీతమే. ఆ పాటలో భూపేందర్ మౌర్న్ ఫుల్ వాయిస్ అనితర సాధ్యమయింది. ఇక బాషర్ నవాజ్ రాసిన 'కరోగే యాద్‌తో..' పాట బాజార్ సినిమాలో హృద్యంగా సాగుతుంది. ఖయ్యాం సంగీతం అందించిన ఈ సినిమాకు సాగర్ సర్హదీ దర్శకత్వం వహించారు. అంతేకాదు 'పరిచయ్' సినిమాలో 'బీతే నా బితాయే రహేనా..' పాటకు లతామంగేష్కర్‌కు జాతీయ అవార్డు వచ్చింది. ఆ పాటను లతాతో కలిసి భూపేంద్ర సింగ్ పాడాడు. దానికి ఆర్డీ బర్మన్ సంగీతం, గుల్జార్ గీత రచన చేసారు. వాళ్లకు అవార్డు రాలేదు కానీ ఆ పాట చిరస్థాయిగా మిగిలిపోయింది. అట్లా తన 50 ఏండ్ల సంగీత జీవితంలో భూపేంద్ర మరెన్నో గొప్ప పాటలు గజల్స్ పాడాడు. అంతే కాదు ఆయనకున్న గిటార్ వాయించే ప్రతిభతో అనేక హిట్ పాటలకు తానే గిటార్ వాయించాడు. వాటిల్లో 'దం మారో దం' (హరే రామ హరే కృష్ణ), చురాలియా హై తుమ్ నే దిల్కో (యాదోంకి బారాత్), మహబూబా మహబూబా (షోలే) లాంటివాటిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. సినిమాల్లో పేరు ప్రఖ్యాతులు సాధించినప్పటికీ భూపేందర్ సింగ్ తనకు ఇష్టమయిన గజల్స్ పాడడం మానలేదు. తన భార్య ప్రముఖ గాయని అయిన మితాలి సింగ్‌తో కలిసి అనేక లాంగ్ ప్లే ఆల్బమ్స్ విడుదల చేసాడు. వాటిల్లో ముఖ్యమయినవి చెప్పాలంటే ఆర్జ్, చాందినీ రాత్ లాంటి అనేకం వున్నాయి. భూపేందర్ సింగ్ అనేక మంది సంగీత కారులతో కలిసి పని చేసినప్పటికీ ఆర్డీ బర్మన్‌తో పాడిన పాటలు విశేష ప్రాచుర్యం పొందాయి. గుల్జార్ గీతాలకు ఆయన స్వరం ఎంతగానో అబ్బింది. ఇట్లా అటు హిందీ సినీ ప్రపంచంలోనూ ఇటు గజల్ లోకంలోనూ చిరస్థాయిలో నిలబడి పోయే గీతాల్ని పాడిన భూపేందర్ సింగ్ మరణం గొప్ప లోటు. తేరి అవాజ్ హీ పహచాన్ హై.

# ప్రతీ వరద బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



నరసాపురం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి) : వరద ప్రభావిత ప్రాంతాలలోని కుటుంబాలన్నిటికీ ప్రభుత్వ సహాయం అందించడం జరుగుతుందని వరద ఉపశమన, పునరావాస ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలకు ప్రతి ఇంటికి 2 వేల రూపాయలు చొప్పున 6,587 మందికి 1.16 కోట్ల రూపాయలు వారి అకౌంట్లలో జమచేయవలసి ఉండగా ఇప్పటివరకు 4,549 మందికి 80 లక్షల 75 వేల రూపాయలు జమచేయడం జరిగిందని మిగిలిన 1670 మందికి 30 లక్షల రూపాయలను ఈరోజు వారి అకౌంట్లకు జమచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలలోని ఏ ఒక్క కుటుంబానికి డబ్బులు మిస్ కాకుండా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. సోషల్ ఆడిట్ చేసి ప్రతి గ్రామంలోనూ డబ్బులు అందుకున్న వారి జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామాలలోని 6,587 కుటుంబాలకుగాను 1,599 కుటుంబాలు వరదనీటిలో ఉండగా వీరికి వరదనీరు తగ్గిన తరువాత ఇవ్వడం జరుగుతుందని ఈ రోజు 4,988 కుటుంబాలకు బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ ఆయిలు, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, బ్రెడ్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. 92.14 శాతం పంపిణీ పూర్తిచేయడం జరిగిందని ఈరోజు 392 మందికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఆరు గ్రామాలు మినహా మిగిలిన అన్ని గ్రామాలలో నీరు తగ్గిపోయిందని ఆరు గ్రామాలలోని 1,599 మందికి వరద నీరు తగ్గిన తర్వాత నిత్యవసర వస్తువులు పంపిణీ జరుగుతుందని అన్ని గ్రామాలలో ప్రస్తుతం టిఫిన్, భోజనము, తాగునీరు నిరంతరాయంగా సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి వద్ద గోదావరి ఏటిగట్టు తాత్కాలిక పునరుద్ధరణకు 58 లక్షల రూపాయలు మంజూరుచేయడం జరిగిందని దీనిని రెండు వారాలలోగా పూర్తి చేస్తామని ఏటిగట్టును పూర్తిస్థాయిలో శాశ్వతంగా బలోపేతం చేయడానికి 17 కోట్ల రూపాయలతో పనులు చేపట్టి వచ్చేవర్షాకాలం నాటికి పూర్తిచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రామాలలో పేరుకుపోయిన సిల్ట్, గార్బేజును మిషనరీని వినియోగించుకొని 48 గంటల్లో తొలగించే పనులు పూర్తిచేయాలని ఆదేశించామని అన్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం, పైపులైన్లు క్లియర్ చేయడం, మోటార్లు రిపేరుచేసి పరిశుభ్రమైన మంచినీరు అందించే విధంగా పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.

మెడికల్ క్యాంపులు నిర్వహించడంతోపాటు ప్రతి ఇంటికివెళ్లి ఫీవర్ సర్వే చేయడం జరుగుతుందని ఎవరికైనా ఎటువంటి లక్షణాలు ఉన్న వెంటనే చికిత్స అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో పూర్తిస్థాయిలో వరదనీరు తొలగిన తర్వాత ఎన్యూమరేషన్ చేయడం జరుగుతుందని దాని ప్రకారంగా ఏపంట ఎన్ని ఎకరాలు నష్టం జరిగింది, ఎన్ని ఇండ్లు పూర్తిగా, ఎన్ని ఇండ్లు పాక్షికంగా డామేజ్ అయినవి వివరాలు తెలుస్తాయని ప్రవీణ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి , జాయింట్ కలెక్టర్ జె వి మురళి, సబ్ కలెక్టరు సి. విష్ణుచరణ్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం: మంత్రి జోగి రమేష్



పెడన /మచిలీపట్నం : 20 జులై ప్రజాపాలన :రైతు ప్రయోజనాలే పరమావధిగా, ప్రజలకు మేలు చేసే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, ఇంకా ఏవైనా అవసరాలు ఉన్నాయో తెలుసుకునేందుకు చేసే ప్రయత్నమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు పెడన నియోజకవర్గం లోని పెడన టౌన్ లో 2 వ వార్డు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చేపట్టారు. ఆయనకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆప్యాయత దక్కుతోంది. ప్రభుత్వం అందించే పథకాల వివరాలు తెలుసుకుంటున్నందుకు స్థానిక ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మీకు మా ఆశీస్సులు ఉంటాయని దీవిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వార్డులో ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఫలానా పథకం మీకు అందుతున్నాయా అని పలువురిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల తీరును తెలుసుకునే కొత్త ఒరవడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డిని, తనను ఆశీర్వదించమని పలువురిని పెద్దలను కోరారు. పెడన పట్టణంలోని 2 వ వార్డు పిచ్చుకవారి వీధిలో ( భజన గుడి సందు) తొలుత ఆయన బళ్లా వెంకటేశ్వరమ్మ, బళ్ళా శ్యామలరావు,గుత్తి సుబ్రమణ్యం, బూరగడ్డ భాస్కరరావు, కట్టా భాగ్యలక్ష్మి తదితరులకు చెందిన 350 మంది ఇళ్లకు తిరుగుతూ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ,ప్రభుత్వం నుండి వారికి అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు , హామీలివ్వటమే కానీ అమలు చేయని ప్రస్తుత రాజకీయాల్లో ఇదిగో నేను అమలు చేసిన హామీలు అని ప్రజల ముంగిటకు సగర్వంగా వెళ్తున్నామని , ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి ప్రజల వద్దకు వెళ్లే దమ్మున్న ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు చూసి ఉండరని అన్నారు..ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా నవరత్నాలతో సీఎం జగన్ మోహన్ రెడ్డి గారు సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు.. అనంతరం స్థానిక వాలంటీర్లు-సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు..పెడనలో తీరనున్న లో వోల్టేజ్ సమస్య పెడన నియోజకవర్గంలో లో-వోల్టేజ్ సమస్య నివారించటానికి రెండు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయటానికి మంత్రి జోగి రమేష్ ,ఎనర్జీ సెక్రటరీతో విజయనందం, ఏ పి ట్రాన్స్ కో సి ఎం డి శ్రీధర్ తో ఈ సమస్య పరిష్కారం కోసం మాట్లాడారు. ఆ ఇరువురు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి త్వరలోనే సర్వే చేయించి రెండు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెడన ఛైర్మెన్ బళ్ళా జ్ఞాన లింగ జ్యోత్స్న రాణి, 3 వ వార్డు కౌన్సిలర్ బళ్ళా గంగయ్య, పెడన తహసీల్దార్ మధుసూధనరావు, విద్యుత్ శాఖ ఏ ఈ సాంబశివరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,వాలంటీర్లు- సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లాలోని కలంకారీ సంప్రదాయ కళను గూర్చి లోక్ సభలో ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి



మచిలీపట్నం టౌన్ : 20 జులై ప్రజాపాలన: ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలోగల కలంకారి సాంప్రదాయ ప్రింటింగ్ కళను సంరక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఏదైనా ప్రతిపాదనలు చేస్తుందా? చేస్తున్నయెడల వాటి వివరములు తెలుపగలరు. లేనియెడల ఈ కలంకారీ కళను సంరక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి ప్రభుత్వం అందించే సహకార తెలుపండి అంటూ జౌళి శాఖ మంత్రి శ్రీమతి. దర్శన జర్దోష్ ను ప్రశ్నించారు. డెవలప్‌మెంట్ కమీషనర్ (హస్తకళలు) కార్యాలయం ద్వారా జాతీయ హస్తకళల కార్యక్రమం ద్వారా కలంకారి సాంప్రదాయ బ్లాక్ ప్రింటింగ్ క్రాఫ్ట్‌ను సంరక్షించడం మరియు ప్రచారం చేస్తున్నామని, హ్యాండీక్రాఫ్ట్ సెక్టార్ స్కీమ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కింద: 2 ఇంటిగ్రేటెడ్ డిజైన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు , 2 డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లు , 1 టూల్‌కిట్ పంపిణీ కార్యక్రమం మరియు 3 హ్యాండిక్రాఫ్ట్ టెక్నికల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు జరిగాయి అని వివరించారు. అంబేద్కర్ హస్త శిల్ప వికాస్ యోజన ద్వారా ఒక కంపెనీ ఏర్పాటు చేయబడింది అని డిజైన్ %డ% టెక్నికల్ అప్‌గ్రేడేషన్ స్కీమ్, మార్కెటింగ్ సపోర్ట్ %డ% సర్వీసెస్ కింద ఆధారిత మద్దతు మరియు దాని స్థిరమైన అభివృద్ధి కోసం కంపెనీకి చేతివృత్తుల వారికి ప్రత్యక్ష ప్రయోజనం చేకూరింది అని ఎంపీ బాలశౌరి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## ఎమ్మెల్యే నానీ దృష్టికి సమస్యలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూలై 20: సమస్యల అర్జీలను స్వీకరించారు. గుడివాడ, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే నానీ దృష్టికి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తనను కలిసిన వారికి భరోసా ఇచ్చారు. నందివాడ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎంపీపీ పెయ్యల అదాం ఎమ్మెల్యే నానికు వివరించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు తోట రాజేష్, షేక్ మౌలాలి, మెరుగుమాల కాళీ తదితర నాయకులు పలు పట్టణ సమస్యలను ఎమ్మెల్యేనానీకు తెలియచేయగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన పొత్తూరి, కొవ్వలి



నరసాపురం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి) : గోదావరి నది వరద ఉధృతికి ముంపుకు గురైన నరసాపురం నియోజకవర్గంలోని సరిపల్లి కొత్తకాలనీ, పట్టణంలోని 29వ వార్డులలో బుధవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి పొత్తూరి రామరాజు, నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత, ఎన్నారై కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు వరదల కారణంగా నీట మునిగిన ఇళ్లను పరిశీలించి బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసాపురం పట్టణంలో ఇరిగేషన్ ఆఫీసు పక్కనే ఉన్న నక్కల డ్రైన్, రుస్తుంబాధ డ్రైన్లు గోదావరిలో కలుస్తాయని ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ మురుగుకాలువకి, గోదావరికి మధ్య ఉన్న లాకు గేట్లు పాడైపోయి కొట్టుకుపోవడం వలన నియోజకవర్గంలోని ఎనిమిది గ్రామాలు ముంపుకు గురయ్యాయని తెలిపారు. గతంలో పనిచేసిన ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు లాకు గేట్లను పరిశీలించి మరమ్మతులు నిర్వహించి వాటిని పటిష్టం చేసేవని కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత మూడు సంవత్సరాలుగా ఈ లాకులపై దృష్టి పెట్టకుండా గాలికి వదిలేయడంతో ఈ పెను విపత్తు సంభవించిందని దీనికి అధికార పార్టీ నేతలు బాధ్యత వహించాలని వారు విమర్శించారు. వరదల కారణంగా ముంపుకు గురైన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, నిత్యవసర సరుకులను వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమామహేశ్వరరావు, అందే రామకృష్ణ, కొప్పాడ రవీంద్రనాథ్, సంధి నరసింహారావు, కుడిపూడి పార్ధసారథి, తిరుమాని హేమంత్, బర్రె మురళి, కరణం రాంబాబు, కడిమి శ్రీ హేమలత, బస్వాని మిస్సమ్మ, తానేటి శ్రీను, సిర్రా గణేష్, సిర్రా నాగబాబు, కడిమి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయాలలో మారుమూల ప్రాంతాలకు పశువైద్య సేవలు



మచిలీపట్నం టౌన్: 20 జులై ప్రజాపాలన :ప్రభుత్వం డా.వైయస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ పథకానికి శ్రీకారం చుట్టిందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా. కె.చంద్రశేఖరరావు బుధవారం మచిలీపట్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 7 నియోజకవర్గాలకు 7 మొబైల్ వాహనాలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల నుండి ఈ మొబైల్ వాహనాల ద్వారా పశువైద్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఈ వాహనంలో ఒక పశు వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్ కం కాంపోండర్ మరియు డ్రైవర్ కం అటెండర్ సిబ్బంది ఉంటారని, పశువులకు ప్రథమ చికిత్స, వ్యాధి నిర్ధారణ, వ్యాధి నిర్ధారణ టీకాలు, నట్టల నివారణ మందులు, చిన్న తరహా శస్త్ర చికిత్సలతో పాటు కృత్రిమ గర్భధారణ మొదలగు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. పశుపోషకులు పశుసంవర్ధక శాఖ వారి టోల్ ఫ్రీ నెం.1962 కు ఫోన్ చేసిన వెంటనే రైతు గుమ్మం వద్దనే పశు ఆరోగ్య సేవలు ఈ వాహనం ద్వారా అందిస్తారని కావున రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 2022 మే 19 న ఈ వాహనాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారని, అప్పటి నుండి జిల్లాలో ఈ వాహనాల ద్వారా 152 గ్రామాల్లో 766 పశువులకు సంచార పశు వైద్య సేవలు అందించడం జరిగిందని, అత్యవసర పశు వైద్య సేవల ద్వారా 160 పశువులకు ప్రాణాపాయ స్థితి నుండి కాపాడినట్లు, ఇప్పటి వరకు 710 మంది రైతులు లబ్దిపొందారని తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



నందిగామ జూలై 20 ప్రజా పాలన ప్రతినిధి: ఎస్సీ వర్గీకరణ ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ సెంటర్లో నిరసన దీక్ష చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం ఎస్ పి నియోజకవర్గ ఇంచార్జ్ కోట దానియేలు మాది గ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ యండ్రాతి కోటేశ్వరరావు మాదిగ హాజరై మాట్లాడారు. ఈ దీక్షలో మండల నాయకులు మంద సురేష్ మాదిగ బచ్చలకూరి చం ద్రరావు మాదిగ. కొర్రపాటి బాబు మాదిగ మైలపోగు ఆద%శీ% మాదిగ . మీసాల రాకేష్ మాదిగ. ఉపెల్లి అరు ణ్ మాదిగ. కూచిపూడి గణేష్ మాదిగ కోట శ్రీకాంత్ మాదిగ. పంది సతీష్ మాదిగ. పంది ఏసుబాబు మా దిగ. జిల్లపల్లి తుఫాన్ బాబు మాదిగలు దీక్షలో కూ ర్చున్నారు తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యక ర్తలు పాల్గొన్నారు.

## తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన ఈవోగా శ్రీరామ వరప్రసాదరావు పదవీ బాధ్యతలు



జగ్గయ్యపేట జూలై 20 ప్రజాపాలన ప్రతినిధి:తిరు మలగిరి గ్రామములో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వా మి వారి దేవస్తానము యొక్క నూతన సహాయ కమి షనర్ మరియు కార్యనిర్వహణాధికారిగా దాసరి శ్రీ రామ వరప్రసాద రావు,బుధవారం బాధ్యతలు స్వీక రించియున్నారు. ఇప్పటి వరకు విధులు నిర్వహిం చి న శ్రీ ఎం కే టి ఎన్ వరప్రసాద్ శ్రీ బాల బాలాజీ దేవ స్తానము అప్పనపల్లికి బదిలీపై వెల్లియున్నారని దేవ స్తాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణా ధికారిగా దాసరి శ్రీరామ వరప్రసాద రావు తెలియజే శారు.

## విద్యుత్ షాక్ తో వ్యవసాయ కూలీ మృతి



పెనుగంచిప్రోలు జులై 20 ప్రజాపాలన ప్రతినిధి:విద్యు త్ షాక్ కు గురై ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని లింగగూడెం గ్రామంలో బుధవారం ఉ దయం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకా రం లింగగూడెం గ్రామానికి చెందిన భూక్య సతీష్(25) కూలి పనుల నిమిత్తం పొలంలోకి వెల్లి మోటర్ వేస్తుం డగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై అక్కడిక క్కడే మరణించాడు.మృతుడు సతీష్ భార్య ఎనిమి ది నెలల గర్భవతి దీంతో ఆ గ్రామంలో విషాదఛాయ లు అలుముకున్నాయి.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



భీమవరం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల వైద్యులు మానవతా దృక్పదంతో వ్యవహరించాలని సకాలంలో వారికి వైద్యాన్ని అందించి సేవలందించాలన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న వైద్య పరికరాలతోపాటు నూతనంగా మరికొన్ని వైద్య పరికరాలను మంజూరు చేసేవిధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులను ముందస్తుగా ఆస్పత్రుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్తగా అప్పర్ సెప్టిక్ ట్యాంకుకు సంబంధించి అండర్ గ్రౌండ్ పైపు లైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమీక్షలో ఇన్చార్జి డీసీహెచ్ఎస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వీరాస్వామి, డాక్టర్ శ్రీనివాసరాజు, సభ్యులు పేరిచర్ల సత్యనారాయణరాజు, కొప్పర్తి వీరరాఘవులు, బాలజ్యోతి మూర్తిలు పాల్గొన్నారు.

## కొనసాగిన జనసేన సహాయ కార్యక్రమాలు



నరసాపురం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి) : నియోజకవర్గంలోని వరద బాధితుల పునరావాస కేంద్రాలలోని తలదాచుకుంటున్న వరద బాధితులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు పంపిణీ కార్యక్రమం మూడవరోజు కొనసాగింది. బుధవారం పట్టణంలోని 30 వ వార్డు చినమామిడిపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వరద బాధితుల పునరావాస కేంద్రంలోని వరద బాధితులకు జనసేన పార్టీ రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు బిస్కెట్ ప్యాకెట్లు, జిలేబీలు, సమోసాలు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు బందెల రవీంద్ర, తోట శ్రీధర్, గణేశ్న శ్రీరామ్, పసుపులేటి అభి, అయితం చిన్ని, యాతం మహేష్, యర్రంశెట్టి మధు, పిప్పళ్ల దుర్గాప్రసాద్, కొప్పాడి కనకరాజు, చినమామిడిపల్లి జనసైనికులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూలై 20: బ్యాంక్ 115వ ఫౌండేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డే వేడుకల కేకును గుడివాడ బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ కట్ చేశారు. అనంతరం రోటరీ క్లబ్, బ్యాంక్ ఆఫ్ బరోడాల సంయుక్త ఆధ్వర్యంలో బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మేనేజర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. 1980లో బరోడాలోని మాన్వి అనే చిన్న గ్రామంలో ప్రారంభమైన బ్యాంక్, నేడు సూర్యుడు అస్తమించని విధంగా ఐదు ఖండాల్లో లావాదేవీలు నిర్వహిస్తూ, విదేశాల్లో అత్యధిక శాఖలు కలిగిన బ్యాంకుగా గుర్తింపు పొందిందని మేనేజర్ రాజశేఖర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పెద్దలు పొన్నూరు రామకృష్ణ, రెడ్డయ్య చౌదరి, రావి శ్రీహర్ష చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా బూస్టర్ డోసు పంపిణీ : సర్పంచ్ మూడే శివ శంకర్ రావు



పామర్రు, (తోట్లవల్లూరు) ప్రజాపాలనప్రతినిధి 20: కృష్ణా జిల్లా, తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామం లో గల పి.హె .సి సబ్ సెంటర్ వద్ద జరిగిన కరోనా నివారణ కోసం ఉచితంగా బూస్టర్ డోసు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన పి.హె .సి డాక్టర్ సాయి ప్రసన్న , ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మరియు బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివ శంకర్ రావు, ఉప సర్పంచ్ కే.శివ శంకర్, కోటేశ్వరమ్మ , రోహిణి , మనిషా ,ఏ.ఎన్.ఎం జ్యోతి , ఆశా వర్కర్లు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## డ్రైవర్ చాకచక్యంతో ఊపిరిపీల్చుకున్న విద్యార్థులు





పామర్రు, (పమిడిముక్కల) ప్రజాపాలన ప్రతినిధి 20:పమిడిముక్కల మండలం పమిడిముక్కల గ్రామం లో ఉన్న జీసస్ స్కూల్ బస్సు టైర్ పంచర్ అవటంతో చాకచక్యంతో డ్రైవర్ వ్యవహరించి విద్యార్థిని విద్యార్థులాను కాపాడినా ఘటన కృష్ణాపురం లో చోటుచేసుకుంది.బస్సులో మొత్తం 48 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉండగా బస్సు టైర్ పంచర్ అవటంతో అదే సమయంలో డ్రైవర్ చాకచక్యంతో తో ఊపిరిపీల్చుకున్న విద్యార్థులు మరియు తల్లితండ్రులు అందరూ ఊపిరి పిలుచుకున్నారు తిరిగి వారిని సురక్షితంగా స్కూల్ కి తరలించారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్



పామర్రుం, తోట్లవల్లూరు, ప్రజాపాలన ప్రతినిధి 20: ,తోట్లవల్లూరు మండలం లోని రొయ్యూరు గ్రామంలో రూ.40 లక్షల నిధుల అంచనా విలువతో నూతనంగా నిర్మించనున్న గ్రామ సచివాలయ భవనానికి ,రూ.21.80 లక్షల నిధుల అంచనా విలువతో నిర్మించనున్న రైతు భరోసా కేంద్ర భవనానికి (ర్ బి కే ), రూ.17.50 లక్షల అంచనా విలువ నూతనంగా నిర్మిస్తున్న వైయస్సార్ ఆరోగ్య కేంద్రం(హెల్త్ సెంటర్) భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఈ సందర్భంగా శాసనసభ్యులు అనిల్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి గారి సహకారంతో నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు అందులో భాగంగానే నేడు రొయ్యూరు గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని,త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు ఈ కార్యక్రమంలో అధికారులు ,వైయస్ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఈడుపుగంటి రాజమణి,జడ్పీటీసీ జొన్నల రామోహన్ రెడ్డి, వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు...

## వర్తక వాణిజ్య సంఘాల వ్యాపారస్తులు నిరసన




మచిలీపట్నం టౌన్ : 20 జులై ప్రజాపాలన :కృష్ణా జిల్లా మచిలీపట్నంలో బుధవారం అకస్మాత్తుగా వర్తకవాణిజ్య సంఘాల వ్యాపారస్తులు నిరసన కార్యక్రమం చేపడుతూ,రాజా గారి సెంటర్లో ధర్నా చేయడం జరిగింది.గత కొంతకాలంగా రాజా గారి సెంటర్లో వాహనాలుప్రయాణించడానికి వీలు లేకుండా ట్రాఫిక్కు డీఎస్పీ భరతమాత జి తీసుకున్న నిర్ణయంతో, వర్తక సంఘాల యజమానులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పట్టణంలోని ప్రముఖులు అందరూ ట్రాఫిక్ డిఎస్పీని కలసి తమ సమస్యను విన్నవించిన ప్రయోజనం లేకుండా పోయిందని తమ బాధను తెలియజే చెప్పడానికి రోడ్డు మీదకు ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోయారు.

# పట్టణాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి). : పట్టణాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉన్న రోడ్ల దుస్థితి, ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత జరిగిన రోడ్ల అభివృద్ధికి సంబంధించి మున్సిపల్ అధికారులు బుధవారం మున్సిపాలిటీ నూతన భవనంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్ ను శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా కారణంగా గత రెండేళ్లలో ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసినప్పటికీ ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డి సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా పనిచేశారని అన్నారు. భీమవరం పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేదిశగా తాను చర్యలు తీసుకోవడం జరిగిందని గత మూడేళ్ళ కాలంలో సుమారు రూ.39 కోట్ల 62 లక్షల నిధులను పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటికే రూ. 8 కోట్ల 50 లక్షల నిధులతో పట్టణంలో 47 రోడ్లను వేయడం జరిగిందని రూ. 4 కోట్ల 72 లక్షలతో చేపట్టిన రోడ్డుపనులు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని మరో 24 రోడ్లకు సంబంధించి రూ. 6 కోట్ల 8 లక్షల నిధులను మంజూరుచేసి వర్క్ ఆర్డర్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రూ. 14 కోట్ల 80 లక్షల నిధులతో చేపట్టే రోడ్డుపనులకు సంబంధించి వర్క్ ఆర్డర్లను ఇవ్వాల్సిఉందని మరో 18 రోడ్ల అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. పెద్ద స్థాయిలో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని పట్టణ ప్రజల విజ్ఞప్తులమేరకు రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులతో తాను సంతృప్తి చెందడం లేదని, పట్టణంలో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించిన తర్వాతే తాను సంతృప్తి చెందుతానని అన్నారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్కును దృష్టిలో పెట్టుకుని రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి పట్టణంలో రైల్వే గేటు ఉన్న ప్రతిచోట అండర్ టన్నెళ్లు నిర్మించామని ప్రస్తుతం గరగపర్రురోడ్డులో అండర్ టన్నెల్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. బైపాస్ రైల్వేగేటు వద్ద, కోడవల్లి రైల్వేగేటు వద్ద కూడా అండర్ టన్నెల్ నిర్మించే దిశగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసిపి గౌరు, మున్సిపల్ ఎంఈ శ్రీకాంత్, డిఈ రాజారావు, టిసిఎస్ శాస్త్రి, ఏఎంసి మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, బిసి సంఘ జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, నాయకులు పేరిచర్ల సత్యనారాయణరాజు, కొప్పర్తి వీరరాఘవులు, చిగురుపాటి రాజు, జంగం మాణిక్యాలరావు, ముల్లి నర్సింహమూర్తి, బాలజ్యోతి మూర్తి, జిలాలుద్దీన్ బాబా, చంద్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ, తుల్లూరి ఎడ్వర్డ్ కృపానందం, పాలవెల్లి మంగ, అల్లూరి నాగవల్లి, చెల్లబోయిన సూర్యప్రకాష్, జవ్వాది సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పరిమితికి మించి టిప్పర్ల ట్రాక్టర్లు ద్వారా గ్రావెల్‌ను తరలింపు

### గ్రావెల్ వాహనాలు రాకపోకలతో గ్రామస్తులకు ఇబ్బందులు



రాజుపాలెం, ప్రజాపాలన : మండల పరిధిలో బీరవల్లిపాయ గ్రామ శివారులో ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ దందా అక్రమంగా సాగిపోతుంది. మైనింగ్ నిబంధనలను తుంగలో తొక్కి రాత్రింబవళ్లు పరిమితికి మించి టిప్పర్ల ట్రాక్టర్లు ద్వారా గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో నాయకులు అక్రమార్కులకు తెర తీశారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో నేతల హస్తం బహిరంగ రహస్యమే. గ్రావెల్ తరలించేందుకు తూతూమంత్రంగా పర్మిషన్ , మైనింగ్ ఒకటి, రెండు, బిల్లు తో గ్రావెల్ తరలిస్తూ మైనింగ్ నిబంధనలు తుంగలో తొక్కారు. దీంతో మైనింగ్ మాఫియా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పర్యవేక్షించాల్సిన మైనింగ్ శాఖ, అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. అరికట్టాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోకపోవటంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిమితికి మించి టిప్పర్ల ట్రాక్టర్లుతో తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. గ్రావెల్ తరలిస్తున్న వాహనాలతో రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు గ్రావెల్ అక్రమ తరలింపును కట్టడి చేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## టిడిపి మండల అధ్యక్షుడు జన్మదిన వేడుకలు.. వెల్లువెత్తిన అభిమానం

### ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించిన మండల టిడిపి శ్రేణులు



గోకవరం జులై 20 ప్రజా పాలన ప్రతినిధి : జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా సేవలందిస్తున్న మంగ రౌతు రామకృష్ణ జన్మదిన వేడుకలు మండల టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మంచి వ్యక్తిత్వం తో పాటు సౌమ్యుడిగా వివాద రహితుడిగా రాజకీయ అనుభవసాలిగా పేరు ప్రఖ్యాతలు పొందిన మండల అధ్యక్షుడు రాముకు మండల నలుమూలల నుండి కార్యకర్తలు నాయకులు అభిమానులు భారీగా తరలివచ్చి సాలువాలు తోను పూల బొకేలతో గజమాలతో శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం కేక్ కటింగ్ జరిపారు భారీగా అభిమానులు పార్టీ శ్రేణులు తరలి రావడంతో ఆయన ఇంటి వద్ద పండగ వాతావరణం నెలకొంది ఈ సందర్భంగా మంగ రౌతు రామకృష్ణ మాట్లాడుతూ తన పట్ల చూపిస్తున్న ప్రేమ అభిమానాలకు ఎప్పుడూ కృతజ్ఞతగా ఉంటానని సామాజిక మాధ్యమాల ద్వారా స్వయంగా తనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అందరి ఆదరభిమానాలు ఎల్లప్పుడూ తనపై ఇలాగే ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నట్లు చెప్పారు.

## రాజా గారి సెంటర్లో బారికేడ్లు పెట్టడానికి గల కారణాలు తెలిపిన ట్రాఫిక్ డియస్పి



మచిలీపట్నం టౌన్: 20 జులై ప్రజాపాలన :రాజా గారి సెంటర్లో బారికేడ్లు పెట్టడానికి గల కారణాలు 1.అక్కడ నాలుగు రోడ్ల జంక్షన్ 2.ఇరుకు రోడ్లు కలిగి ఉండటం 3. తరచుగా విపరీతంగా ట్రాఫిక్ ఆగిపోవడం 4. తరచుగా అదే ప్రదేశం లో మళ్ళీ మళ్ళీ ప్రమాదాలు జరగడం. పై కారణలనాలన్నీ 100 శాతం పరిశీలించిన పిమ్మట రాజా గారి సెంటర్ అత్యంత ప్రమాదకరంగా ఉందని భావించి ఉన్నతాధికారుల సలహాలు తీసుకున్న తర్వాతే మూసి వేయడం జరిగింది. దానికి దగ్గరలోనే మున్సిపల్ ఆఫీస్ దగ్గర మరియు రేవతి సెంటర్లలో కట్టింగ్ కూడా ఉంది.అంతేకాకుండా మధ్య మధ్యలో మనుషులు రోడ్డు దాటి వెళ్ళడానికి కూడా ఖాళీలు ఉన్నాయి .మన మచిలీపట్నం చాలా వేగంగా పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా మారుతుంది.త్వరలోనే బందరు లో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ప్రారంభించడానికి సిద్ధంగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంలో ఈ ట్రాఫిక్ ని కొంచెం కంట్రోల్ చేసే ఉద్దేశంతో ఈ రకమైన చర్యలు చేపట్టడం జరిగింది తప్ప మాకు ఎవరినీ కూడా ఇబ్బందులకు గురి చేసే ఉద్దేశ్యం లాంటివి లేదని, అంతేకాకుండా ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత రాజా గారి సెంటర్ లో ఒక్క ప్రమాదం కూడా జరగలేదు. కాబట్టి వ్యాపారస్తులు మరియు పట్టణ ప్రజలు దీన్ని అర్థం చేసుకుని పట్టణ అభివృద్ధికి మరియు ట్రాఫిక్ పోలీసు వారికి సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నామని ట్రాఫిక్ డియస్పి భరత్ మాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

## దాతృత్వం చాటుకున్న రోటరీ అధ్యక్షులు



చీరాల,జూలై 20, ప్రజాపాలన : పేద విద్యార్థినికి ఆర్థికంగా చేయూతను అందించి, రోటరీ క్లబ్ అధ్యక్షులు,అంబేద్కర్ ఐడియాలజీ ఫోరం చైర్మన్,ప్రముఖ వైద్యులు డాక్టర్ ఐ.బాబూరావు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.చీరాల నియోజకవర్గ పరిధిలోని, జాంద్రపేటకు చెందిన షైనీ అనే పేద విద్యార్థిని,పాఠశాల ఫీజు చెల్లించే పరిస్థితులు లేక, ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకుని, డాక్టర్ ఐ.బాబూరావు, చిన్నారికి ప్రేమహాస్పటల్ ప్రాంగణంలో రు.11వేలు ఆర్థిక చేయూత నందించి, దాతృత్వాన్ని చాటుకున్నారు.రోటరీ సభ్యుల సహకారంతో, రోటరీ క్లబ్ ద్వారా,సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని, డాక్టర్.బాబూరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చందలూరి బాల వెంకటేశ్వర రావు,రోటరీ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పోలుదాసు రామకృష్ణ,చిన్నారి షైనీ, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల ఉల్లంఘన జరుగకుండా చూడాలి: ఎఐసి సిసి డైరెక్టర్ పట్టెం డేవిడ్ మనోహర్



ఒంగోలు, జూలై 20, ప్రజాపాలన : మానవ హక్కుల ఉల్లంఘన జరుగకుండా,చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బాల కార్మికులుగా అవస్థలుపడుతున్న, చిన్నారులపై దృష్టిసారించాల్సిన బాధ్యత కార్మికశాఖపై ఉందని, ఏఐసిసిసి డైరెక్టర్ పట్టెం.డేవిడ్ మనోహర్ అన్నారు. ఒంగోలు పట్టణంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో, హెచ్ ఆర్ సి ఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికఅయిన సందర్భంగా, ఖలీఫాతుల్లాబాషాకు,పుష్పగుచ్ఛం అందచేసి, ఆయనసేవలను కొనియాడి,ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్‌ప్రెసిడెంట్ హైమావతి, జ్ఞానసుందరి లు మాట్లాడుతూ, మహిళల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తు న్నామని, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో రిటైర్డ్ ఎఎస్పీ సుంకరసాయిబాబా, పలుప్రాంతాల నుంచి హాజరైన మానవహక్కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంకు ఉత్తమ ఖాతాదారునిగా మాజీ ఎం.పి.టి.సి. గోలి ఆనందరావు



చీరాల, జూలై 20, ప్రజాపాలన : చీరాల కెనరాబ్యాంకు ఖాతాదారుల్లో ఉత్తమఖాతాదారునిగా, ఈపూరుపాలెంకు చెందిన మాస్టర్ వీవర్, వైసీపీనాయకులు,మాజీ ఎంపీటీసీ.గోలి ఆనందరావు ఎంపికయ్యారు.ప్రతి ఆర్థిక వార్షిక సంవత్సరం బ్యాంకు లావాదేవీల్లో నిర్దిష్టంగా ఉన్న ఉత్తమ ఖాతాదారులను అభినందించడం ఆనవాయితీగా జరుగుతుందని,ఈ ఏడాది ఉత్తమఖాతాదారులలో ఒకరిగా, మాజీ ఎంపీటీసీ గోలి ఆనందరావు తమ బ్యాంకులో, ఆర్థిక లావాదేవీలను నిర్దిష్టంగా నిర్వహిస్తూ, ఉత్తమ ఖాతాదారునిగా ఎంపికైనట్లు బ్యాంకు మేనేజర్ జిఆర్పి గాయత్రి తెలిపారు. ఉత్తమ ఖాతాదారునిగా ఎంపికైన ఆనందరావును అభినందించి జ్ఞాపికను అందజేశారు.

## టోల్‌ప్లాజాను ఢీకొట్టిన అంబులెన్స్..నలుగురు మృతి!!

కర్ణాటక: రోగి, ఇద్దరు సహాయకులతో వెళ్తున్న ఓ అంబులెన్స్ వేగంగా వచ్చి టోల్‌ప్లాజాను ఢీకొట్టింది. టోల్‌ప్లాజా వద్దకు రాగానే అంబులెన్స్ అడ్డంగా తిరిగి ఓ టోల్‌ప్లాజాను గుద్దుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో నలుగురు మృతిచెందారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.ఈ ఘటన కర్ణాటకలోని ఉడిపి జిల్లా షిరూర్‌లో బుధవారం జరిగింది. రోగి, ఇద్దరు సహాయకులతో వెళ్తున్న అంబులెన్స్ అదుపు తప్పి టోల్ బూత్‌లోకి దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డ్రైవర్‌తోపాటు మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఒక వైద్యుడు ఈ ఘటనకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని ట్విటర్‌లో షేర్ చేయగా, చక్కర్లు కొడుతోంది.ఈ వీడియోలో అంబులెన్స్ వస్తుండడం గమనించి, టోల్‌ప్లాజా సిబ్బంది ఇద్దరు మూడు ప్లాస్టిక్ బారికేడ్లను తొలగించేందుకు పరుగెత్తుకు వెళ్లారు. జోరున వర్షం కురుస్తోంది. అయితే, అంబులెన్స్ అతివేగం వల్ల అదుపుతప్పింది. మొదటి వ్యక్తి రెండు బారికేడ్లను విజయవంతంగా తొలగించాడు. కానీ, రెండో వ్యక్తిని అంబులెన్స్ ఢీకొట్టింది. టోల్‌ప్లాజాలోకి చొచ్చుకెళ్లింది. ఈ వీడియో చూసి నెటిజన్లు భయభ్రాంతులకు గురవుతున్నారు.

# గురుకుల పాఠశాలను సందర్శించిన నాయకులు



గోకవరం జూలై 20 ప్రజాపాలన ప్రతినిధి :గోకవరం మండలం వీరలంక పల్లి గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలను గోకవరం మండల ప్రజా ప్రతినిధులు పాఠశాలను సందర్శించి పరిశీలించారు. అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల రాణి వేణి ని విద్యార్థుల విద్యా బోధనలు యోగ క్షేమాలలను అడిగి తెలుసుకున్నారు.నూతనంగా ఎంతమంది విద్యార్థినిలు ఎంపికయ్యారని ఎన్ని సీట్లు ఉన్నాయి అని వివరాలు సేకరించారు. విద్యార్థులకు ఆహార సంబంధిత అంశాలపై వారుపాఠశాల నందు వారివసతుల వివరాలును పరిశీలించారు. అదేవిధంగాప్రతిరోజు ప్రభుత్వం కేటాయించిన మెనూవివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులుమాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆంధ్ర రాష్ట్రంలో విద్యార్థిని విద్యార్థులకు సక్రమంగా విద్య అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కార్యచరణ చేపడుతున్న నేపథ్యంలో విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలుతమ విద్యకు ముందు ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. మా వంతు సక్రమ బాధ్యతగా మండల ప్రజాప్రతినిధులుగా పాఠశాలకు ఎటువంటి అసౌకారాలు ఎదురైనా విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సంబంధిత సమస్యలు ఎదురైనా మా దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి అవసరాలను వారు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న,ఇబ్బందులను వెంటనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు విద్యను ప్రోత్సహించివిద్య పట్ల తమ పిల్లలకు చోరవ చూపాలని కోరారు. వైయస్సార్సీపి ప్రభుత్వం విద్యార్థులకు మంచి విద్యను అందించాలని మంచి సంకల్పంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను విద్యార్థులకు అందించడం జరుగుతుందని విద్యా రంగంలో ఆంధ్ర రాష్ట్ర విద్యార్థులు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, ప్రభుత్వం గర్వపడేలా చెప్పుకునేలా విద్యార్థులు శ్రద్ధ తీసుకుని అదే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి విద్యార్థులకు విద్య బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యను ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# కొత్తపల్లి లో పొలంబడి కార్యక్రమం







గోకవరం 20 ప్రజా పాలన ప్రతినిధి :గోకవరం మండలం కొత్తపల్లి గ్రామం నందు పొలంబడి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వ్యవసాయ సహాయకుడు ఈ సత్య చైతన్య నారాయణ మాట్లాడుతూ క్రింది విధంగా రైతులకు సూచనలు అందించారు. రైతులు అందరూ వరి నాట్లు వేసే సమయంలో కచ్చితంగా ఆకు కొనలను త్రుంచి వరి నాట్లను వెయ్యాలి అని కోరడం జరిగింది.ఈ పద్ధతి ద్వారా కాండం తొలుచు పురుగు యొక్క గుడ్లను నారుమడి లోనే అంతం చేయవచ్చు అని రైతులందరికి వివరించడం జరిగింది.రైతులు అందరూ పొలం గట్లపై కంది మొక్కలు వేసుకోవడం ద్వారా ప్రధాన పొలంలో పురుగుల ఉదృతిని తగ్గించవచ్చు అని వివరించారు. ప్రభుత్వ%శీ% ద్వారా 100% రాయితిలో రైతులకు కంది విత్తనాలను అందించడం జరిగింది.వరి నాట్ల సమయంలో ఆకు కొనలను త్రుంచి వరి నాట్లను వెయ్యడం,పొలం గట్లపై కంది విత్తనాలు విత్తుకోవాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గ్రామ సర్పంచ్ కంచుమర్తి కాటంస్వామి, తోటవీర వెంకట పద్మనాభం (బాబి గారు ), ముదిలి రాజశేఖర్ (బుజ్జి మాస్టారు, పోతాబత్తుల శ్రీనివాస్ ,దుక్కావీరబాబు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# తిరుమలలో ఘనంగా పల్లవోత్సవం

తిరుమల: తిరుమల లో బుధవారం పల్లవోత్సవం ఘనంగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని టీటీడీ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేశారు. మైసూరు సంస్థానం వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. తర్వాత కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు.

# రాజకీయ నాయకుల ఆధీనంలో ఎండోమెంట్ భూమి,అధికారులు




గోకవరం జులై 20 ప్రజాపాలన ప్రతినిధి :పశ్చిమగోదావరి జిల్లా సుందరమ్మ ట్రస్ట్ కు సంబంధించిన భూమి సర్వే నెంబర్ 411లో సుమారు 102ఎకరాలు గోకవరం మండలం రంపఎర్రం పాలెం గ్రామంలో ఉంది. ఈ భూమిపై విచారణ చేపట్టి ఎర్రంపాలెంలో ఉన్న నిరుపేదలకు ,దళితులకు పంచి పెట్టాలని బుధవారం నాడు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సర్వే నంబర్ 411 లో సుమారు 102 ఎకరాలు సుందరమ్మ ట్రస్టుకు సంబంధించిన దేవాదాయ ధర్మాదాయ భూమి రంపయరంపాలెంలో ఉందని ఆయన తెలిపారు. ఆ భూమిని దశాబ్దాల కాలంగా అధికారులు, రాజకీయ నాయకులు అండదండలతో పబ్లిక్ పాటలు లేకుండా, సాటింపులు లేకుండా, ఎవరికి తెలియకుండా తప్పుడు రికార్డులు రాస్తూ అక్రమంగా అనుభవిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎండోమెంట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఆ భూమిలో మామిడి,జీడి మామిడి, టేకు తోటలు వేసి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారని, ఏ పంటలు వెయ్యాలి, వెయ్యకూడదు అనేది నిబంధన ఉందని, మూడు సంవత్సరాలకి ఒకసారి వరి పంటలు మొదలైనవి వెయ్యాలని నిబంధనం ఉందని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఈ ఓ లేని ఊరు ఏదైనా ఉందంటే అది రంప ఎర్రంపాలెం అని, టిడిపి అధికారంలో , వైసిపి అధికారంలో ఉంటే ఆపార్టిలకు సంభంధించిన కుటుంబాలు రాజ్యమేలుతున్నారని ఆయన విమర్శించారు.100 సంవత్సరాల నుండి ఈ రెండు కుటుంబాలు ఎండోమెంట్ ఈ ఓ ని వెయ్యనివ్వలేదు. వీరంతా సొంత భూములు కలిగిన భూస్వాములు ఆయన తెలిపారు. ఇదే ఊర్లో సెంటు భూమిలేని అగ్రవర్ణ పేదలు కూడా ఉన్నారని ఆయన తెలిపారు.అసలు భూమి 102 ఎకరాలు ఉంటే కేవలం 91 ఎకరాలే ఉందని మిగతా పది ఎకరాలు ఏమైనట్టు అని ప్రశ్నించారు.

రాజకీయ నాయకుల వత్తిల్లకు భయపడి ఎండోమెంట్ అధికారులు ఆ ఊరు రావడానికి గజగజ వణుకుతున్నారని, భూస్వాముల పేరు చెపితే అధికారులు భయపడి వెన్నుల్లో వనుకుపడుతుందని ఆయన ఎద్దేవ చేశారు.ఈ భూమిపై గతంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, అరెస్టులు ,నిర్బంధాలు, జైలు పాలయ్యారని ఆయన తెలిపారు. ఈ భూమిని పేద ప్రజలకు పంచి పెట్టాలని కలెక్టర్ వారికి, డ్ సీ వారికి వినతి పత్రాలు అందించడం జరిగింది .అన్ని వినతి పత్రాలు అందించిన గాని అధికారుల్లో చలనం లేదని,రాజకీయ నాయకుల అండదండలతో ఆ భూములో మామిడి, జీడి మామిడి పంటలు వేసి లక్షలాది రూపాయలు దోసుకుంటున్నారని, వారు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడుతున్నారని ఆయన విమర్శించారు. అదేవిధంగా ఈ భూమిపై అవకతవకలను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూమినీ ఎవరైతే నిరుపేదలు ఉన్నారో వారికి ఇచ్చి వలస బాటలు ఆపాలని, ఊరి ప్రజల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. తక్షణమే ఈ భూమిపై విచారణ చేపట్టి పేదలకు పంచి పెట్టాలని, లేకుంటే దశలవారీగా రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని కర్నాకుల హెచ్చరి%శీ%చారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రంపచోడవరం డివిజన్ నాయకులు సురేష్, గ్రామ నాయకులు గోలి ముసలయ్య,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ అనిల్ ఆత్మీయుడు కావటం ఆనందకరం: వైఎస్సార్ సిపి చీరాల నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు



చీరాల, జూలై 20, ప్రజాపాలన : వార్డు అభివృద్ధికి, వార్డులో సమస్యల పరిష్కారానికి, అహర్నిశలు శ్రమిస్తున్న వార్డ్ కౌన్సిలర్ బత్తుల అనిల్ కుమార్, వార్డు ప్రజలందరికీ ఆత్మీయుడు కావటం ఆనందంగా ఉందని, వైయస్సార్సీపీ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా,వార్డులో పర్యటిస్తున్న వైసిపి ఇన్చార్జి వెంకటేష్‌బాబుకు, ప్రజల నుండి విశేష స్పంద న, ఆదరణ లభించాయి.జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం, వలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వైసిపి ఇన్చార్జి వెంకటేష్ బాబు ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికలలో వైసీపీని అఖండ మెజారిటీతో



గెలిపించి, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ ని గెలిపించుకుని, రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. వార్డు లో సమస్యలు ఏమైనా ఉన్నాయేమో అడిగి తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరా లున్న కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్.పాలేటి రామారావు,మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు,వైస్ ఛైర్మన్ జైసన్ బాబు,వార్డు కౌన్సిలర్ బత్తుల అనీల్, కౌన్సిలర్లు గోలి స్వాతి, కీర్తి వెంకట్రావు, గుంటూరు ప్రభాకర్ రావు,సచివాలయ సిబ్బంది,డి ఇ ఏసయ్య,దేవరపల్లి బాబురావు, కొండ్రు బాబ్జీ, ఆర్ బి కె ఛైర్మన్ కావూరి రమణారెడ్డి, పి ఎ సి ఎస్ ఛైర్మన్ బోయిన కేశవులు, చుండూరి వాసు,గోలి గంగాధర్,దాసరి రామకృష్ణ ప్రసాద్, మల్లెల రాజశేఖర్,శిఖా సురేష్, సల్లూరి అనిల్, కబీర్,మహిమూద్, అక్కల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులే మేలు: వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, జూలై 20, ప్రజాపాలన : తక్కువ పెట్టుబడితో, సేంద్రియఎరువుల ద్వారా, అధిక దిగుబడి సాధించవచ్చునని, రైతాంగ సంక్షేమ మే లక్ష్యంగా ఎమ్మెల్యే బలరామ్, వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు లు చేస్తున్న కృషి, ప్రశంసనీయమని, వ్యవసాయ సలహా మండలి (ఆర్ బి కె) ఛైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు.చీరాల మండలం, తోటవారిపాలెం పంచాయతీ పరిధిలో, ప్రకృతి వ్యవసాయం ద్వారా, సాగు చేస్తున్న వేరుశెనగ సాగుని, బెండ, ఇతర కూరగాయలసాగుని, ఆకుకూరలను, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ పంట లను ప్రకృతి వ్యవసాయం ద్వారా జీవామృతము, ఆవుపేడలతో, తయారుచేసిన మిశ్రమాల ద్వారా, సాగు చేస్తున్నారన్నారని, ఆ దిశలో ఆలో చించాలని సూచించారు.కార్యక్రమంలో చీరాల డివిజన్



ఏడిఏ.ఉషారాణి, ఏవో.సుమతి, చీరాల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి. రమణారెడ్డి, ప్రకృతివ్యవసాయఅధికారి భీమరాజు, మంజుల, ఐసిఆర్‌పి కార్యకర్తలు, ఆర్బికే అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధులకు నిత్యవసరాలు, చీరలు పంపిణీ



నరసాపురం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి) : యునైటెడ్ కాపు వనితాక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బొండమ్మ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు, చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, కాపు వనితా క్లబ్ రీజయనల్ ఛైర్మన్, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యాలక్ష్మి మాట్లాడుతూ కని పెంచిన తల్లిదండ్రులను వారి పిల్లలు ఈ విధంగా వృద్ధుల ఆశ్రమాల్లో వదిలేయడం దారుణమని అన్నారు. క్లబ్ %జూ% అధ్యక్షురాలు వలవల సావిత్రి మాట్లాడుతూ తల్లి దండ్రులను వారి పిల్లలు చిన్న పిల్లల కన్నా ఎక్కువగా చూసుకోవాలన్నారు. ఈ కార్యకమంలో కౌన్సిలర్ తోట అరుణ, కాపు వనిత క్లబ్ జాయింట్ సెక్రటరీ పిప్పళ్ళ సుప్రజ, ట్రెజరర్ రంగినీడి భరణి, వైస్ ప్రెసిడెంట్ పోలిశెట్టి నళిని, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# వరద ముంపుకు గురై జలదిగ్బంధంలో చిక్కుకున్న బాధితులకు కొత్తపేట మండల యువ శెట్టిబలిజ సంఘం ఆహార పొట్లాల పంపిణీ...



కొత్తపేట (ప్రజాపాలన ప్రతినిధి) :కొత్తపేట మండలం యువ శెట్టిబలిజ సంఘం వారు ఈ రోజు కొత్తపేట, కేదార్లంక, వీది వారి లంక, ధనమ్మ మర్రి తదితర లంక గ్రామాలలో ఉన్నటువంటి నాలుగు వందల వరద బాధిత కుటుంబాలకు బిర్యానీ ప్యాకెట్లు అందచేశారు.ఈ కార్యక్రమానికి మానవతా దృక్పథంతో ఆర్థిక సహకారాలు అందించిన రాజమండ్రి తాలూకా దంగేటి జానకి రామయ్య, జొన్నలగడ్డ గురుమూర్తి (రిటైర్డ్ టీచర్స్)కు ఈ సందర్భంగా సంఘ సభ్యులు ధన్యవాదములు తెలియజేశారు.అదేవిధంగా ప్రభుత్వం అందించే వరద సాయం వీలైనంత తొందరగా వరద బాధితులకు అందించాలని కోరారు. సంఘ సలహాదారు కొప్పిశెట్టి వాసు,సంఘ అద్యక్షుడు బొక్కా ప్రసాద్, సంఘ ఉపాధ్యక్షుడు చింతపల్లి నాని, సెక్రెటరీ శీలం కొండబాబు,ఆర్గనైజింగ్ సెక్రటరీ ముషిని వెంకట రమణ, ట్రెజరరి కముజు తాతాజీ,కడలి పార్ధ సారథి,ఇళ్ల సురేష్,కేతా సతీష్, వాసంశెట్టి శ్రీనివాస్,దంగేటి వెంకట్,జోగి గని, వాసంశెట్టి కృష్ణమోహన్,దొమ్మేటి భాస్కర్,దొమ్మేటి జగదీష్,శీలం హరీష్,శీలం సుధీర్,పిల్లి గోవిందు చిట్టూరి నవీన్, చిట్టూరి రమణ, మట్టపర్తి లోకేష్ కుమార్, కొప్పిశెట్టి సాయి, కొప్పిశెట్టి ఫణి, బొక్కా గణపతి, కుడిపూడి పవన్ కుమార్,బొక్కా నవీన్,గుత్తుల చిన్నాని, కొప్పిశెట్టి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పర్యటన ప్రాంతాల పరిశీలన



నరసాపురం, జూలై 20 (ప్రజాపాలన ప్రతినిధి) : గోదావరి నది వరదల ఉధృతికి ముంపుకు గురైన ప్రాంతాలను, వరద ఉధృతికి కోతకు గురైన ఏటిగట్లను పరిశీలించి వరద బాధితులను పరామర్శించేందుకు తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నరసాపురం పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత కొవ్వలి రామ్మోహన్ నాయుడు బుధవారం పార్టీ నేతలతో కలిసి చంద్రబాబు పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కౌన్సిలర్ పాలూరి బాబ్జి, పార్టీ నేతలు కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమామహేశ్వరరావు, పొన్నాల నాగబాబు, గుగ్గిలపు సూర్యనారాయణ, బర్రె మురళి, తిరుమాని శశిదేవి, తిరుమాని హేమంత్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ది వినుకొండ హెూటల్స్ అసోసియేషన్ సమావేశం ముఖ్యఅతిథిగా పలనాడు జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి సిహెచ్ లక్ష్మీనారాయణ



వినుకొండ జులై 20 (ప్రజాపాలన ప్రతినిధి): ది వినుకొండ హెూటల్స్ అసోసియేషన్ సమావేశం సాయంత్రం నాలుగు గంటలకు హెూటల్స్ అసోసియేషన్ సమావేశం శ్రీ ఆంజనేయ విలాస్ నందు అధ్యక్షులు ఇమ్మడిశెట్టి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పలనాడు జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి సిహెచ్ లక్ష్మీనారాయణ పాల్గొని హెూటల్స్ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు తోపాటు ప్రతి వ్యాపారిలు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆహార తయారీలో ఎలాంటి రంగులు వాడొద్దని మరియు కళ్ళు ఉప్పు వాడకుండా అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలన్నారు. ఆహార పదార్థాలను ఆహార పదార్థాలు తయారు చేసేందుకు ఉప్పునీటిని వాడకుండా మంచినీటిని వాడాలన్నారు. వంట పాత్రలు కూడా పరిశుభ్రంగా ఉండాలని ఆయన అన్నారు. భోజనశాలలో పాటించవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు అనంతరం మేము ఆహారములో ఎటువంటి రంగులు వాడటం లేదు అనే ఫ్లే కార్డు ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో మాడిశెట్టి అంకారావు ఇమ్మడిశెట్టి రమేష్ రామిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## కార్తికేయ 2 ని ఇంగ్లీష్ లో విడుదల చేయమన్న స్వామిజీ!




నిఖిల్ హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన కార్తికేయ చిత్రం సూపర్ హిట్ గా నిలిచిన విషయం తెల్సిందే. అందుకే కార్తికేయ కు సీక్వెల్ గా కార్తికేయ 2 ని రూపొందించారు. ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న కార్తికేయ 2 సినిమా పబ్లిసిటీ కార్యక్రమాల హడావుడి మామూలుగా లేదు. చిత్ర యూనిట్ సభ్యులు అన్ని విధాలుగా సినిమా ను జనాల్లోకి తీసుకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు.తాజాగా ఇస్కాన్ టెంపుల్ ను యూనిట్ సభ్యులు సందర్శించి అక్కడ స్వామిజీలకు సినిమా యొక్క ట్రైలర్ ను చూపించడంతో పాటు పోస్టర్ లను చూపించారట. సినిమా యొక్క కథను కూడా వినిపించిన యూనిట్ సభ్యులు ఇస్కాన్ టెంపుల్ లో స్వామిజీలతో మాట్లాడారట. ఆ సమయంలో ఇస్కాన్ టెంపుల్ సహ అధ్యక్షుడు అయిన వ్రిందావన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారట.ఆయన మాట్లాడుతూ.. సినిమా లో సనాతన ధర్మం గురించి చాలా చక్కగా చెప్పారు. కనుక మన సనాతన ధర్మ గురించి ప్రపంచంకు తెలియాల్సిన అవసరం ఉంది. అందుకే ఈ సినిమా ను ఇంగ్లీష్ లో డబ్ చేసి విడుదల చేయాలని సూచించారట. హాలీవుడ్ ప్రేక్షకుల వరకు ఈ సినిమాను చేరవేస్తే హిందూ సాంప్రదాయం మరియు సనాతన ధర్మ గురించి అందరికీ తెలుస్తుందని ఆయన పేర్కొన్నారట.సినిమా విడుదలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సినిమా టాక్ ను బట్టి ఇంగ్లీష్ లో విడుదల విషయమై యూనిట్ సభ్యులు ఆలోచించే అవకాశం ఉందని తెలుస్తోంది. సినిమా పై యూనిట్ సభ్యులు చాలా పాజిటివ్ గా కనిపిస్తున్నారు.కార్తికేయ సినిమా తో పోల్చితే ఈ సినిమా అంతకు మించి రెట్టింపు స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం ను యూనిట్ సభ్యులు వ్యక్తం చేశారు.ఈ సినిమా లో నిఖిల్ కు జోడీగా అనుపమ పరమేశ్వరన్ నటించింది. కీలక పాత్రలో కార్తికేయ 1 లో హీరోయిన్ గా నటించిన స్వాతి రెడ్డి కూడా కనిపించబోతుందనే వార్తలు ఆ మధ్య వచ్చాయి. కాని ఆ విషయంలో యూనిట్ సభ్యుల నుండి ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. సినిమా ట్రైలర్ విడుదల అయిన తర్వాత అంతా కూడా సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ఓటిటిలో మాధవన్ “రాకెట్రి” రిలీజ్ డేట్ వచ్చేసింది.!



మన సౌత్ ఇండియన్ సినిమా దగ్గర ఉన్నటువంటి పలువురు వెర్సటైల్ నటుల్లో కోలీవుడ్ స్టార్ నటుడు మాధవన్ కూడా ఒకరు. అయితే నటుడుగా తెలుగు సహా తమిళ్ లో పలు సినిమాలతో ఆకట్టుకున్న మాధవన్ తన డ్రీం ప్రాజెక్ట్ గా చేసిన లేటెస్ట్ చిత్రమే “రాకెట్రి – ది నంబియార్ ఎఫెక్ట్”.కొన్ని నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని మాధవన్ నే స్వీయ దర్శకత్వం మరియు నిర్మాణం వహించి ప్రధాన పాత్రధారునిగా నటించారు. అయితే పాన్ ఇండియా లెవెల్లో థియేటర్స్ లో రిలీజ్ అయ్యి మంచి ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఓటిటి లో స్ట్రీమింగ్ కి రావడానికి సిద్ధం అయ్యింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు సొంతం చేసుకున్న ప్రముఖ ఓటిటి సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వారు ఈ చిత్రాన్ని ఈ జూలై 26 నుంచి స్ట్రీమింగ్ కి తీసుకురాబోతున్నట్టు తెలిపారు. మరి తమిళ్ సహా తెలుగు హిందీ మినహా ఇతర దక్షిణాది భాషల్లో ఈ చిత్రం అయితే స్ట్రీమ్ కానుంది. మరి ముందు మిస్ అయ్యిన వారు అయితే ఈసారి చూడొచ్చు.

## ‘బబ్లీ బౌన్సర్’ తమన్నా రెడీ.. ఇదేదో కొత్తగా ఉందే!




మిల్కీ బ్యూటీగా తనకంటూ ఒక స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్న తమన్నా ఇటీవల కాలంలో అగ్ర హీరోలతో అనుకున్నంతగా అవకాశాలు అందుకోవడం లేదు. ఇక ప్రస్తుతం ఆమె ఫోకస్ ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ సినిమాలపై పడింది. సినిమాలలో మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేయాలని కూడా తమన్నా ఎక్కువగా ఆలోచిస్తున్నట్లు అర్థం అవుతుంది.ఇక త్వరలోనే ఒక సరికొత్త కాన్సెప్ట్ తో రూపొందుతున్న ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటివరకు ఎవరు కూడా పెద్దగా ట్రై చేయని బౌన్సర్ తరహా కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల కాలంలో స్టార్ సెలబ్రిటీలకు ప్రత్యేకంగా సెక్యూరిటీగా బౌన్సర్స్ ఉంటున్న విషయం తెలిసిందే. అయితే అందులో ఎక్కువగా మగవాళ్ళు ఉంటుంటారు.కానీ ఈసారి ఒక అమ్మాయి ఉంటే ఎలా ఉంటుంది. ఇక అందులో కూడా అందమైన అమ్మాయి మరింత పవర్ఫుల్గా కనిపిస్తే ఏ విధంగా ఉంటుంది అనే తరహాలో ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది. దర్శకుడు మధుర్ భండార్కర్ డైరెక్ట్ చేసిన ఈ సినిమాను స్టార్ స్టూడియోస్ జంగ్లీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.ఇక బాబ్లీ బౌన్సర్ 23 సెప్టెంబర్ 2022న డిస్నీం హాట్స్టార్లో హిందీ తమిళం మరియు తెలుగులో విడుదల కానుంది. ఇక తమన్నా ఫస్ట్ లుక్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ అయితే వస్తోంది.నార్త్ ఇండియాలో నిజమైన ‘బౌన్సర్ టౌన్’ బ్యాక్ డ్రాప్ లో సెట్ చేయబడిన ఒక కామెడీ డ్రామాగా ఈ సినిమా రానుందట. అసోలా ఫతేపూర్ గా తమన్నా భాటియాను బాబ్లీ బౌన్సర్గా మునుపెన్నడూ చూడని లోక్ చూస్తారట.ఇక సౌరభ్ శుక్లా అభిషేక్ బజాజ్ మరియు సాహిల్ వైద్ కీలక పాత్రలలో నటించారు. అయితే మొదట ఈ సినిమాను థియేటర్ లోనే విడుదల చేయాలని అనుకున్నారు. కానీ హాట్ స్టార్ నుంచి మంచి ఆఫర్ రావడంతో అందులోనే విడుదల చేసేందుకు చిత్ర నిర్మాతలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరి ఈ సినిమాతో తమన్నా ఎలాంటి గుర్తింపును అందుకుంటుందో చూడాలి.

## వ్యక్తిగా ఇప్పుడు చాలా మారాను: నాగ చైతన్య



యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య గత కొంతకాలంగా వరుస విజయాలతో దుకుపోతున్నాడు. సినీ కెరీర్ సక్సెస్ ఫుల్ గా సాగుతుండగా.. చై వ్యక్తిగత విషయంలో మాత్రం ఎవరూ ఊహించని సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భార్య సమంతతో విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో అతను మరో హీరోయిన్ తో సంబంధం కలిగి ఉన్నాడని రూమర్స్ వచ్చాయి. అయితే చై మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా కెరీర్ మీదే ఫుల్ ఫోకస్ పెట్టినట్లు అర్థం అవుతోంది.నాగచైతన్య హీరోగా విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన “థాంక్యూ” సినిమా విడుదలకు సిద్ధమైంది. దిల్ రాజు నిర్మాణంలో రూపొందిన ఈ మూవీ ఈ నెల 22న థియేటర్లలోకి వస్తోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. చైతన్య కూడా వరుస ఇంటర్వ్యూలతో సందడి చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్కినేని వారసుడు పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ‘థాంక్యూ’ కథ గురించి దర్శకుడు విక్రమ్ – రచయిత బి.వి.ఎస్. రవి – నిర్మాత దిల్ రాజు చెప్పినప్పుడు నాలో ఒక ప్రత్యేకమైన ఆసక్తి కలిగింది. ఇలాంటి కథల్ని విక్రమ్ చాలా బాగా డీల్ చేస్తుంటారు. ‘మనం’ సినిమాని ఓ కథలా చెప్పుకొంటే సింపుల్ గానే ఉంటుంది. కానీ దాన్ని విక్రమ్ ప్రెజెంట్ చేసిన తీరు ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఈ సినిమాలోనూ ఆ మ్యాజిక్ కనిపిస్తుంది అని నాగచైతన్య తెలిపారు. 16 ఏళ్ల టీనేజ్ కుర్రాడి నుంచి 36 ఏళ్ల వ్యక్తి వరకు నాలుగైదు దశల్లో ఈ సినిమాలో నా పాత్ర కనిపిస్తుంది. శారీరకంగా మానసికంగా పలు రకాలుగా ఛాలెంజింగ్ గా అనిపించిన చిత్రమిది. అయితే 16 ఏళ్ల కుర్రాడి లుక్ కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆ పాత్ర కోసం చాలా బరువు తగ్గాను. మూడు నెలలపాటు వర్కవుట్ చేయడంతో పాటుగా కొన్ని వర్క్ షాప్స్ కూడా చేశామని చైతూ చెప్పారు. ఇందులో నేను మహేష్ బాబు అభిమానిగా కనిపిస్తాను. ప్రత్యేకమైన టైమ్ లైన్ లో నడిచే కథ కాబట్టి ఆ రోజుల్లో వచ్చిన మహేష్ సినిమాల్ని కవర్ చేస్తూ స్క్రీన్ ప్లే సాగుతుంది. ‘ప్రేమమ్’ సినిమాలో మూడు దశల్లోని ప్రేమకథలు కనిపిస్తే.. ఇందులో జీవితానికి సంబంధించిన కథ కనిపిస్తుందని అన్నారు. థాంక్యూ సినిమాలో నటిస్తూ వ్యక్తిగా చాలా మారానని చైతన్య చెప్పారు. ఇంతకుముందు తాను ఎక్కువగా మాట్లాడేవాడిని కాదని.. మనసులో ఉన్న విషయాల్ని సగమే బయటికి చెప్పేవాడినని.. కానీ ఇప్పుడు ఫ్యామిలీ మరియు ఫ్రెండ్స్ వద్ద ఏదైనా అనిపిస్తే ఓపెన్ గా చెప్పేస్తున్నానని అన్నారు.అమీర్ ఖాన్ తో కలిసి ‘లాల్ సింగ్ చద్దా’ సినిమా చేయడం గురించి మాట్లాడుతూ.. ఆయనతో ప్రయాణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ సినిమా చిరంజీవి సమర్పణలో రిలీజ్ అవుతుండటం ఆనందంగా ఉంది అని నాగచైతన్య చెప్పారు. కొత్తగా హిందీ సినిమాలేవీ ఒప్పుకోలేదని.. ముందు తనను బాలీవుడ్ ప్రేక్షకులు యాక్సెప్ట్ చేయాలని.. అప్పుడే హిందీ చిత్రాల గురించి ఆలోచిస్తానని తెలిపారు.కరోనా కారణంగా ఇంట్లో కూర్చుని సినిమాని ఆస్వాదించడం అలవాటైంది. అందులో తప్పేమీ లేదు. టైం అలా మార్చింది. ఇప్పుడు పరిశ్రమగా మేం దానికి తగ్గట్టుగా మారాలి. ప్రేక్షకుడిని మళ్లీ థియేటర్కి తీసుకురావాలంటే దానికి తగ్గట్టుగా కంటెంట్ సిద్ధం చేయాలి. ట్రైలర్ టీజర్లోనే ఓ ప్రత్యేకతని చూపించాలి అని అన్నారు. సినిమాపై పెట్టుబడి తీరు కూడా మారాలి. అందరూ తమ రెమ్యునరేషన్లను లాభాల నుంచి తీసుకునేలా మాట్లాడుకోవాలి. ఓటీటీల్లో రిలీజ్ చేయడంపైనా అందరూ మాట్లాడుకొని ఓ నిర్ణయం తీసుకోవాలి అని చైతూ అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా వెంకట్ ప్రభుతో చేస్తున్న సినిమాలో పోలీస్ గా కనిపించనున్నట్లు వెల్లడించారు. ‘దూత’ వెబ్ సిరీస్ లో తన భాగం షూటింగ్ పూర్తయిందని నాగచైతన్య తెలిపారు.

## తన నెక్స్ట్ మూవీ పై వేణు ఉడుగుల ఇంట్రెస్టింగ్ కామెంట్స్!



టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ వేణు ఉడుగుల విరాట పర్వం చిత్రం తో ప్రేక్షకుల నుండి, విమర్శకుల నుండి ప్రశంసల అందుకున్నారు. తాజాగా ఈ డైరెక్టర్ తన నెక్స్ట్ మూవీ గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన సినిమాలలో సామాజిక సమస్యలను చిత్రీకరించడంలో ప్రసిద్ధి చెందిన ఈ డైరెక్టర్ తన నెక్స్ట్ మూవీ కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వేణు తన తదుపరి చిత్రం పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ అని ప్రకటించారు. కథ, స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని దర్శకుడు తెలిపారు. ఇది హీరో సెంట్రిక్ కమర్షియల్ సినిమా అని, ప్రజలు చూడటానికి ఇష్టపడే అన్ని అంశాలతో కూడిన చిత్రమని వేణు వెల్లడించారు. కొత్త సినిమా కల్పిత కథ అని ధృవీకరించారు. హీరో, హీరోయిన్, తదితర మరిన్ని వివరాలను ఈ నెలాఖరున ప్రకటిస్తామని తెలిపారు.

## రానా నాయుడు.. రిలీజ్ కోసం బిగ్ ప్లాన్!



దగ్గుబాటి హీరోలు ఎప్పటి నుంచో ఒక మల్టీస్టారర్ సినిమా చేయాలని ప్లాన్ చేసుకుంటూ వచ్చిన విషయం తెలిసిందే. గతంలోనే నిర్మాత సురేష్ బాబు ప్రముఖ దర్శకులతో కూడా చర్చలు జరిపారు. ఎలాగైనా తన తమ్ముడు వెంకటేష్ ను అలాగే కొడుకు రానా దగ్గుబాటిని వెండితెరపై అద్భుతంగా ప్రజెంట్ చేయాలి అని అనుకున్నారు. కానీ సరైన స్క్రిప్ట్ సిద్ధం కాకపోవడంతో సురేష్ బాబు ఎక్కువగా ఆలోచించలేకపోయారు. అయితే రానా దగ్గుపాటి సలహా మేరకు వెబ్ సిరీస్ ద్వారా వీరిద్దరూ కలిసి నటిస్తూ ఉండడం విశేషం. అమెరికన్ క్రైమ్ డ్రామా రే డొనోవన్ ఆధారంగా తెలుగు నేటి వీటికి తగ్గట్టుగా నిర్మించిన రాణానాయుడు వెబ్ సిరీస్ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నెట్ ఫ్లిక్స్ ఎంతో భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పై అంచనాలు కూడా గట్టిగానే ఉన్నాయి.మొదటిసారి వెంకటేష్ తో పాటు రానా కూడా వెబ్ సిరీస్లో నటిస్తూ ఉండడం ఆసక్తికరంగా మారింది. ఇక ఈ సీరిస్ విడుదల ఎప్పుడు అవుతుంది అనే విషయంలో అనే రకాల రూమర్స్ వైరల్ అవుతున్న సమయంలో చిత్ర యూనిట్ ఇటీవల ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.ఇక ఈ దీపావళికి ఈ వెబ్ సిరీస్ ను గ్రాండ్ గా విడుదల చేయాలని అనుకుంటున్నారు. అయితే రెగ్యులర్ గా కాకుండా ఒక పెద్ద సినిమా ఎలాగైతే రిలీజ్ అవుతుందో అదే తరహాలో ప్రమోషన్స్ చేసి విడుదల చేయాలని అనుకుంటున్నారు.ఎందుకంటే ఇటీవల కాలంలో అమెజాన్ ప్రైమ్ అలాగే మరికొన్ని ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ లో బలమైన కంటెంట్ ఉన్న సిరీస్ లో వస్తున్నాయి. కాబట్టి వాటి పోటీని తట్టుకొని జనాలను ఆకర్షించాలి అంటే ప్రమోషన్స్ గట్టిగానే ఉండాలి.అందుకే నెట్ ఫ్లిక్స్ కూడా ఈ విషయంలో చాలా సీరియస్ గానే ఆలోచించినట్లుగా తెలుస్తోంది. కరణ్ అంశుమాన్ సూపర్న్ వర్మ సంయుక్తంగా దర్శకత్వం వహించిన రానా నాయుడులో మరి కొంతమంది ప్రముఖ నటనలు కూడా ప్రత్యేకమైన పాత్రలో కనిపించబోతున్నారు.






Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com